
షణ్ముఖ SHANMUKHAVELUGU APTEL 16448

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు తెలుగు దినపత్రిక


వంటవారు కావలెను
ప్రకాశం జిల్లా పొదిలి పట్టణంలో
నూతనంగా ఏర్పాటు చేయనున్న టిఫెన్ మరియు మినిమీల్స్
హోటల్ నందు పని చేసేందుకు అనుభవం కల్గిన వంట వారు కావలెను.
కుటుంబంతో వచ్చి పని చేయవలెను. వసతి, భోజనం ఉచితం.
Contact : 9966665060

సంపుటి : 1 సంచిక : 244 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ బుధవారం 17 జూలై 2024 పేజీలు 8 : వెల 5/- ఒంగోలు

VOLUME : 01 ISSUE : 244 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Wednesday 17 july 2024 PAGES : 8 PRICE : 5/-

# ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు





ధాన్యం కొనుగోలు కోసం రూ.2000 కోట్ల రుణం

ఏపీ మంత్రి మండలి సమావేశంలో నిర్ణయాలకు ఆమోదం

**( అంకుశం, అమరావతి, జూలై 16):**

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేస్తూ ఏపీ మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. అదేవిధంగా ధాన్యం కొనుగోలు కోసం రూ.2000 కోట్ల రుణం తీసుకోవాలని నిర్ణయించారు. అమరావతి రాష్ట్ర సచివాలయం మొదటి బ్లాకు కేబినెట్ సమావేశ మందిరంలో మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర మంత్రి మండలి సమావేశం నిర్వహించారు. మంత్రి మండలి సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయం నాల్గవ భవనం ప్రచార విభాగంలో రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖామాత్యులు కొలుసు పార్థసారధి మీడియాకు వెల్లడించిన వివరాలు ఇలా.. ఆంధ్రప్రదేశ్ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ - 2022 రద్దును ఆమోదిస్తూ కేబినెట్ తీర్మానం.

ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ -2022 పై ప్రజలకు పలు సందేహాలు, అనుమానాలు, భయాలు ఉన్నాయన్న విషయం పలు పత్రికలు, ఇతర మీడియా సంస్థల ద్వారా తేటతెల్లమైందని ల్యాండ్ టైటిలింగ్ - మిగతా3లో

## మళ్లీ ఢిల్లీకి రైతుల ర్యాలీ..

- ఉద్యమం ఆగదని ప్రకటించిన బీకేయూ
- జంతర్‌మంతర్‌లో కానీ, రామ్‌లీలా మైదానంలో కానీ శాంతియుత నిరసనలకు దిగుతాం పండించిన పంటలకు కనీస మద్దతు ధర హామీ ఇవ్వడంతో సహా పలు డిమాండ్లపై రైతులు గత కొన్నాళ్లుగా నిరసలు
- ఈసారి తమను అడ్డుకున్నా, రహదారులపై బారికేడ్లు ఏర్పాటు చేసిన ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి




## బడ్జెట్ సన్నాహాలు...

- పార్లమెంటులో హల్వా తయారుచేసిన కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్
- జులై 22 నుంచి పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు
- జులై 23న బడ్జెట్ ప్రవేశపెట్టనున్న కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్
- పార్లమెంటు నార్త్ బ్లాక్ లో హల్వా తయారీ కార్యక్రమం
- హాజరైన నిర్మలా సీతారామన్, ఆర్థిక శాఖ అధికారులు, పార్లమెంటు సిబ్బంది




## జోక్యం చేసుకోవద్దు



- మంత్రులు, ఎమ్మెల్యేలకు సీఎం చంద్రబాబు స్వీట్ వార్నింగ్
- ఇన్వాల్వ్ అయి చెడ్డ పేరు తెచ్చుకోవద్దని హితవు
- అక్టోబర్ తర్వాత ఇసుక రీచులు అన్నీ అందుబాటులోకి వస్తాయి
- బోట్ సొసైటీలకు కూడా అనుమతి ఇస్తున్నాం
- రాష్ట్ర ప్రయోజనాలు, ప్రజలకు మంచి చేయాలనే ఢిల్లీ వెళ్తున్నామని వెల్లడి
- ఈ నెల 22వ తేదీ నుంచి 5 రోజులు అసెంబ్లీ సమావేశాలు
- శ్వేత పత్రాలపై అసెంబ్లీలో చర్చిస్తాం
- ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దు చేయాలని అసెంబ్లీ సమావేశాల్లో బిల్లు పెడతాం.

**అమరావతి**

ఉచిత ఇసుక రీచుల విధానంలో జోక్యం చేసుకోవద్దని మంత్రులకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఇన్వాల్వ్ అయి చెడ్డ పేరు తెచ్చుకోవద్దని హితవు పలికారు. ఇసుక రీచుల విషయంలో ఎమ్మెల్యేలు కూడా కల్పించుకోకూడదని తేల్చి చెప్పారు. అక్టోబర్ తర్వాత ఇసుక రీచులు అన్ని అందుబాటులోకి వస్తాయని వివరించారు. బోట్ సొసైటీలకు కూడా అనుమతి ఇస్తున్నామని తెలిపారు. 43 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక డంప్ యార్డుల్లో ఉందన్నారు. రాష్ట్ర ప్రయోజనాలు, ప్రజలకు మంచి చేయాలనే ఢిల్లీ వెళ్తున్నామని వెల్లడించారు. మంత్రివర్గ సమావేశం ముగిసిన తర్వాత రాజకీయ అంశాలపై మంత్రులతో సీఎం చంద్రబాబు చర్చించారు. ఈ నెల 22వ తేదీ నుంచి 5 రోజులు అసెంబ్లీ సమావేశాలు జరుగుతాయి. 'తొలి రోజు గవర్నర్ ప్రసంగంతో సమావేశాలు ప్రారంభం అవుతాయి. శ్వేత పత్రాలపై అసెంబ్లీలో చర్చిస్తాం. ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దు చేయాలని - మిగతా3లో



## ఏపీలో రెండ్రోజుల పాటు భారీ వర్షాలు

- లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్న ఏపీఎస్డీఎంఏ
- బంగాళాఖాతంలో అల్పపీడనం
- రేపు ఏపీలో అక్కడక్కడ పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు
- ఈ నెల 18, 19 తేదీల్లో రెండు, మూడు చోట్ల అతి భారీ వర్షాలు

## లెక్చరర్ పోస్టుల భర్తీకి లైన్ క్లియర్..!!



- ఫీజు రీయింబర్స్ మెంట్‌పై విధివిధానాలు రూపొందించాలని అధికారులకు ఆదేశాలు
- కాలేజీల్లో డ్రగ్స్ నియంత్రణకు మరింత పటిష్టమైన చర్యలు
- ప్రత్యేకంగా నోడల్ ఆఫీసర్ల నియామకం అంశాన్ని పరిశీలించాలి
- న్యాయపర చిక్కులను తొలగించి త్వరగా పోస్టుల భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలి
- రాజకీయ ప్రమేయం లేకుండా నియామకం జరగాలి
- ప్రతిభ ఆధారంగా, పారదర్శకంగా పోస్టుల భర్తీ ప్రక్రియ చేపట్టాలి.

**అమరావతి**

పాత ఫీజు రీయింబర్స్ మెంట్‌పై విధివిధానాలు రూపొందించాలని విద్యాశాఖా మంత్రి నారాలోకేశ్ అధికారులకు ఆదేశాలు జారీచేశారు. విద్యాదీవెన, వసతి దీవెనకు సంబంధించి గత ప్రభుత్వం 3,480 కోట్లు బకాయిలు విధించిన సంగతి తెలిసిందే. బకాయి విడుదల చేయకపోవడంతో ఆయా విద్యాసంస్థల్లో విద్యార్థుల సర్టిఫికెట్లు ఉన్నాయి. గత ప్రభుత్వ అనాలోచిత విధానాల వల్ల విద్యార్థుల - మిగతా3లో

# జోక్యం చేసుకోవద్దు..

-మొదటిపేజీ తరువాయి

అసెంబ్లీ సమావేశాల్లో బిల్లు పెడతాం. ఈ చట్టం ఎంత ప్రమాదకరమో అనే విషయంపై అసెంబ్లీలో చర్చ జరగాలి. పంటల బీమా పథకం పకడ్బందీ అమలుకు ముగ్గురు మంత్రులతో కమిటీ వేస్తాం. గత ప్రభుత్వం ప్రీమియం కట్టకుండా రైతులను మోసం చేసింది. రైతు భరోసా కేంద్రాల ద్వారా రూ.1600 కోట్ల రుణం తీసుకొచ్చి వెయ్యి కోట్లు మాత్రమే రైతులకు ఇచ్చారు. మిగిలిన రూ.600 కోట్లకు సంబంధించి వివరాలు లేవు. ధాన్యం సేకరణపై కూడా చర్చ జరగాలి. పౌర సరఫరాల కార్పొరేషన్‌తోపాటు వ్యవసాయ శాఖ సేకరణ అంశంపై చర్చిస్తాం. సమగ్ర వివరాలు రెండు రోజుల్లో ఇవ్వాలని అధికారులను ఆదేశించా. అధికారులు నిదానంగా ఉన్నారు. క్షేత్రస్థాయి సమాచారం వేగంగా తీసుకురావాలి అని' సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.



**గనులు, భూ కబ్జాలపై..!**

'గనులు, భూకబ్జా అంశంపై కమిటీ వేయాలని ఆలోచిస్తున్నాం. ఏ విషయంపై తొందరపడి మాట్లాడొద్దు. కాకినాడలో ద్వారంపూడి బియ్యం అక్రమాలపై మంత్రివర్గంలో చర్చ జరిగింది. తండ్రి పౌర సరఫరాల కార్పొరేషన్ చైర్మన్, కొడుకు ఎమ్మెల్యే, మరో కుమారుడు రైస్ మిల్లర్ల అసోసియేషన్ చైర్మన్. ముగ్గురూ కలిసి బియ్యం రీసైక్లింగ్ చేసి కిలో రూ.43కు ఎగుమతి చేశారు. దీనిపై సమగ్ర దర్యాప్తు జరగాలి. వచ్చే మంత్రివర్గం సమావేశం వరకు ఏం చేద్దాం అనే దానిపై విధి విధానాలతో రావాలి. సీనియర్ మంత్రులు కూడా కొత్త విషయాలు నేర్చుకోవాలి. నేను ఈ రోజు వరకు కొత్త విషయాలు నేర్చుకుంటా. నాకు తెలియని అంశాలు చాలా ఉన్నాయి. కొత్త వాళ్ళు మంత్రివర్గంలో చాలా మంది ఉన్నారు, సబ్జెక్ట్ పై ఎప్పటికప్పుడు అవగాహన పెంచుకోవాలి. ప్రజలు ఎన్నో ఆశలతో ఉన్నారు, అందుకు తగ్గట్టు మనం పనిచేయాలి. ఆగస్టు 1వ తేదీన ఇళ్ల వద్ద ఫించన్ పంపిణీలో పాల్గొందాం అని' సీఎం చంద్రబాబు తేల్చి చెప్పారు.

**ఏటా రూ.35 వేల కోట్ల ఖర్చు**

'వివిధ సంక్షేమ పథకాల కోసం ఏటా 35 వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం. మనం వెళ్లి ఇస్తే బాగుంటుంది. అన్న కాంటీన్లు వంద ఆగస్టులో ప్రారంభిస్తాం. ఆర్థిక సమస్యలు ఉన్నాయి, ఇన్నొవేటివ్‌గా ఆలోచించి ముందుకెళదాం. నెల రోజుల మంత్రుల పని తీరుపై చర్చ. ప్రభుత్వం పూర్తిగా లోటు బడ్జెట్టులో ఉంది. ఆ విషయం తెలుసుకొని పనిచేయండి. హెచ్‌వోడీలతో సహా శాఖలకు సంబంధించిన అంశాలపై ప్రతీ నెల సమీక్ష చేయాలని మంత్రులకు ఆదేశం. తమ శాఖల పరిస్థితిని ప్రజలకు వివరించాలని మంత్రులను ఆదేశించా. మంత్రులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచన. పార్టీ కార్యాలయంలో కూడా మంత్రులు అందుబాటులో ఉండాల్సిందేనని స్పష్టీకరణ. అధికారాన్ని తలకెక్కించుకోవద్దని మంత్రులకు సూచన. మంత్రులు ఎమ్మెల్యేలతో పంతాలకు పోకుండా.. సమన్వయంతో పనిచేయాలి అని' సీఎం చంద్రబాబు సూచించారు.

# ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు

-మొదటిపేజీ తరువాయి

తెలిపింది. దీంతో ఈ చట్టాన్ని రద్దు పర్చాలని భూయజమానుల నుండి తీవ్రస్థాయిలో ఒత్తిడి మొదలైంది. ఈ చట్టాన్ని రద్దు పరచడానికి ఏపీ టైటిలింగ్ అథారిటీ ప్రస్తావించిన కారణాలు. నీతి ఆయోగ్ రూపొందించిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ప్రకారం టీఆర్ వో గా ప్రభుత్వ అధికారి ఉండాలి. కానీ ఆ స్థానంలో గత ప్రభుత్వం ఎటువంటి అర్హత లేని వ్యక్తులను కూర్చోబెట్టేందుకు అవకాశం కల్పించే విధంగా మార్పులు చేసింది. ఈ యాక్ట్ ప్రకారం సివిల్ కోర్టుల ప్రమేయం పూర్తిగా తుడిచివేయ బడుతుంది. టీఆర్ వో దగ్గర సమస్య ఉత్పన్నమైతే నేరుగా వ్యయప్రయాసలకోర్చి హైకోర్టును ఆశ్రయించాల్సిన పరిస్థితి. టైటిల్ రిజిస్ట్రేషన్ అధికారులు చేసే వారసత్వ ఆస్తుల బదలాయింపులు సివిల్ కోర్టుల ద్వారా చేయబడవు. ఈ చట్టం అమల్లోకి వస్తే ప్రస్తుత ఉన్న రిజిస్ట్రేషన్ వ్యవస్థ, రెవెన్యూ వ్యవస్థ మరియు న్యాయ వ్యవస్థ కనుమరుగయ్యే పరిస్థితి.



ఇసుక, గనుల పాలసీ – 2019 మరియు మరింత మెరుగైన ఇసుక విధానం –2021లను రద్దుచేస్తూ ఉచిత ఇసుక మెకానిజం –2024 ఏర్పాటు అయ్యేంత వరకు ప్రభుత్వానికి ఆదాయం లేకుండా ప్రజలకు ఉచితంగా ఇసుకను అందించే మధ్యంతర వ్యవస్థ ఏర్పాటు చేసేలా తేదీ: 8.7.2024న జారీ చేసిన జీవో ఎం.ఎస్ నంబర్ 43 కు కేబినెట్ ఆమోదం. ఇప్పటివరకు ఆయా సంస్థలతో ఉన్న ఒప్పందాలను నిలుపుదల చేయడం, ఇసుక కు సంబంధించిన స్టాక్ ను సంబంధిత అధికారులకు అప్పగించాలని మైన్స్ అండ్ జియాలజీ కమిషనర్ కు ఆదేశాలు జారీ చేస్తూ కేబినెట్ ఆమోదం. శాండ్, మైనింగ్ పాలసీ –2022 మరియు మరింత మెరుగైన ఇసుక పాలసీ –2021 లను క్షుణ్ణంగా అధ్యయనం చేసిన మీదట వినియోగదారుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుంటూ పర్యావరణ హితంగా సమగ్ర ఇసుక విధానం (కాంప్రహెన్సివ్ శాండ్ పాలసీ) – 2024 ను రూపొందించాల్సిన అవసరం ఉంది. వినియోగదారులకు సరసమైన ధరలకు ఇసుక లభించేలా చూడటం, శాండ్ ఆపరేషన్ లో పారదర్శకతను పెంపొందించడం, ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాను అరికట్టడం, పర్యావరణ హితం కోరుతూ గౌరవ సుప్రీంకోర్టు, హైకోర్టు, జాతీయ హరిత ట్రిబ్యూనల్ (ఎన్ జీటీ) ఇచ్చిన మార్గదర్శకాల మేరకు సమగ్ర ఇసుక విధానం –2024 ను ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. 2024–25 సంవత్సరానికి గానూ ధాన్యం కొనుగోలు ప్రక్రియ కోసం రూ.2000 కోట్ల రుణాన్ని వాణిజ్య బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థల నుండి రాష్ట్ర ప్రభుత్వ పౌర సరఫరాల సంస్థ పొందేలా అనుమతిస్తూ తేది: 28.6.2024 నాడు రాష్ట్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, పౌర సరఫరాల శాఖ జారీ చేసిన జీవో ఎం.ఎస్ నంబర్ 6 లో రాష్ట్ర ప్రభుత్వ హామీని కోరుతూ చేసిన ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదం. గత రబీ సీజన్ లో సేకరించిన వరి ధాన్యానికి 84 రోజులు గడిచినా ఎటువంటి సొమ్ము చెల్లించకుండా తాత్సారం చేశారు. ఈ నేపథ్యంలో మన ప్రభుత్వం అధికారంలోకి రాగానే బకాయి పడ్డ సొమ్ము రూ. 1000 కోట్లు సదరు రైతులకు చెల్లించింది. రైతులకు కనీస మద్దతు ధర కల్పించే పథకంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం రైతుల నుండి ఆహార, పప్పు ధాన్యాలను సేకరించి జాతీయ ఆహార భద్రతా చట్టానికనుగుణంగా తెల్ల రేషన్ కార్డు కలిగి దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు రాయితీ ధరలకు అందిస్తున్న విషయం విదితమే. ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం ధాన్యసేకరణకు రుణాలను తీసుకోవాల్సిన పరిస్థితి. ప్రకృతి వ్యవసాయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అంతర్జాతీయ స్థాయిలో అత్యంత ప్రతిష్టాత్మక గుల్బెంకియన్ అవార్డు వచ్చిందని, ఇది వ్యవసాయ రంగంలో నోబెల్ ప్రైజ్ తో సమానమని,ఈ అవార్డు క్రింద 9 కోట్ల రూపాయలు వచ్చింది. ఈ ప్రకృతి సేద్యాన్ని 2018లో నాటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో 5 లక్షల హెక్టార్లతో ప్రారంభమై 10 లక్షల మంది రైతులను భాగస్వాములను చేయడం జరిగింది. ఎలాంటి రసాయనాలు వినియోగించకుండా చేస్తున్న ప్రకృతి సేద్యం ప్రస్తుతం 4 రెట్లు పెరిగి 2029 నాటికి 20 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ప్రకృతి సేద్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రపంచానికి మార్గదర్శిగా నిలిచి ఆదర్శ ప్రాయం అవుతుందని ముఖ్యమంత్రి కేబినెట్ కి తెలియజేశారు.

# జగన్ ఓవర్ టూ బెంగళూరు...

**విజయవాడ :** జగన్ ఇటీవల తరచూ బెంగళూరు వెళుతున్నారు. ఎన్నికల్లో ఓటమి తర్వాత ఒకసారి వెళ్లారు. వారం రోజులపాటు అక్కడే ఉన్నారు. ఇప్పుడు మరోసారి వెళ్తున్నారు. వారం రోజులు పాటు అక్కడే గడపనున్నారు. ఈసారి వైద్య సేవల కోసమే ఆయన బెంగళూరు వెళ్తున్నట్లు వైసిపి వర్గాలు చెబుతున్నాయి. అయితే షర్మిల రూపంలో కాంగ్రెస్ పార్టీ నుంచి విమర్శల డోర్స్ పెరగడంతోనే ఆయన బెంగుళూరు వెళుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ద్వారా షర్మిలను కట్టడి చేసేందుకే నన్న టాక్ నడుస్తోంది. అయితే అందులో ఎంత నిజం ఉందో తెలియాలి.జగన్ కు పులివెందులతో పాటు బెంగళూరు, హైదరాబాదులో ప్యాలెస్ లు ఉన్నాయి. అందులో రాజశేఖర్ రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు సమకూర్చుకున్నవి కూడా ఉన్నాయి. ముఖ్యంగా హైదరాబాదులోని లోటస్ ఫండ్ రాజశేఖర్ రెడ్డి హయాంలో నిర్మించినదే. వైసిపి ఆవిర్భావం కూడా అక్కడి నుంచే ప్రారంభమైంది. ఉమ్మడి రాష్ట్రంలో రాజకీయ కార్యకలాపాలను అక్కడి నుంచే నిర్వర్తించారు జగన్. రాష్ట్ర విభజన జరిగిన తర్వాత తాడేపల్లిలో ప్యాలెస్ కట్టుకున్నారు. 2019 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన తర్వాత అదే ప్యాలెస్ కు పరిమితం అయ్యారు. అయితే అప్పటినుంచి లోటస్ ఫండ్ ఖాళీగా ఉంది. షర్మిల ఏపీ నుంచి తెలంగాణ వెళ్లి రాజకీయాలు చేశారు. వైయస్సార్ తెలంగాణ పార్టీని స్థాపించారు. అయితే ఆమె సైతం లోటస్ ఫండ్ నుంచే తన కార్యకలాపాలను మొదలుపెట్టారు. అంటే అది ఉమ్మడి ఆస్తి కనుక.. అందులో తనకు కూడా వాటా ఉందని షర్మిల కోరినట్లు తెలుస్తోంది. రాజశేఖర్ రెడ్డి హయాంలో నిర్మించింది కనుక.. జగన్ సైతం షర్మిల అందులో ఉండేందుకు అంగీకరించినట్లు ప్రచారం జరుగుతోంది.కేవలం ఆస్తి వివాదాల వల్లే సోదరుడు, సోదరి మధ్య విభేదాలు వచ్చాయి. రాజకీయంగా విభేదించేంతవరకు పరిస్థితి వచ్చింది. ఈ కాంగ్రెస్ పార్టీని ద్వేషించారో అదే పార్టీలోకి షర్మిల వెళ్లాల్సి వచ్చింది. అయితే ఇప్పుడు అదే షర్మిల ఏపీ కాంగ్రెస్ బాధ్యతలు తీసుకొని జగన్ పై పోరాడుతున్నారు. గట్టిగానే ఫైట్ చేస్తున్నారు. అదే సమయంలో హైదరాబాద్ లోటస్ ఫండ్ తన ఆధీనంలో ఉంచుకున్నారు. అందుకే జగన్ హైదరాబాద్ వెళ్లడం లేదని తెలుస్తోంది. కేవలం షర్మిల వల్లే ఈ పరిస్థితి వచ్చిందని ఒక టాక్ అయితే మాత్రం నడుస్తోంది.బెంగళూరులో విలాసవంతమైన ప్యాలెస్ జగన్ కు ఉంది. రాజకీయాల్లో యాక్టివ్ కాకమునుపే జగన్ బెంగళూరు కేంద్రంగా వ్యాపారాలు చేసేవారు. రాజశేఖర్ రెడ్డి సీఎం అయిన తరువాత వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించారు. అయితే బెంగళూరులో ముచ్చటపడి యలహంక ప్రాంతంలో ఒక ప్యాలెస్ ను కట్టుకున్నారు. అదే ప్యాలెస్ లోకి ఇప్పుడు వెళుతుంటారు. మొన్నటి ఎన్నికల్లో ఓటమి చెందిన తర్వాత భార్యతో కలిసి పులివెందుల వెళ్లారు. అక్కడ నుంచి బెంగళూరు చేరుకున్నారు. ఐదు రోజులపాటు అక్కడే గడిపారు. సీఎంగా ఉన్నప్పుడే కాలికి గాయంతో బాధపడ్డారు జగన్. ఇప్పుడు వైద్యం చేసుకునేందుకు మరోసారి బెంగళూరు వెళ్తున్నారు.అయితే బెంగళూరు పర్యటన వెనుక ఎటువంటి రాజకీయ కోణం లేదని వైసీపీ వర్గాల నుంచి వినిపిస్తున్న మాట. హైదరాబాదులోని లోటస్ ఫండ్ షర్మిల ఆధీనంలో ఉన్నట్లు తెలుస్తోంది. అందుకే జగన్ సైతం హైదరాబాద్ వెళ్లకుండా.. బెంగళూరులో తన సొంత ఇల్లు ఉండడం కారణంగా అక్కడికి వెళుతున్నట్లు సమాచారం. అయితే కేవలం రాజకీయ కోణంలో చూసి.. కాంగ్రెస్ పార్టీతో మంతనాలు సాగించేందుకే తరచూ జగన్ బెంగళూరు వెళుతున్నట్లు టాక్ నడిచింది. తనను జగన్ కలిశారన్న ప్రచారానికి చెక్ చెప్పారు డీకే శివకుమార్. దానిలో ఎలాంటి నిజం లేదని కూడా తేల్చి చెప్పారు. ఒక రాష్ట్రానికి డిప్యూటీ సీఎం, ట్రబుల్ షూటర్ గా ఉన్న డీకే శివకుమార్ ఈ తరహా ప్రకటన చేశారంటే.. పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. జగన్ బెంగళూరు వెళుతుంది కేవలం షర్మిల హైదరాబాద్ లోని లోటస్ ఫండ్ స్వాధీనం చేసుకోవడమే కారణమని తెలుస్తోంది. అందులో ఎంతవరకు వాస్తవం ఉందో చూడాలి

## ఏపీలో రెండ్రోజుల పాటు భారీ వర్షాలు



అల్పపీడన ప్రభావంతో ఏపీలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. కాగా, ఈ నెల 18, 19 తేదీల్లో రాష్ట్రంలో రెండు మూడు చోట్ల అతి భారీ వర్షాలు, అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) వెల్లడించింది. రేపు (జులై 17) అక్కడక్కడ పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు పడతాయని తెలిపింది. గురు, శుక్రవారాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఏపీఎస్డీఎంఏ ఎండీ రోణంకి కూర్మనాథ్ తెలిపారు. వాయవ్య, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో దక్షిణ ఒడిశా తీరానికి ఆనుకుని అల్పపీడనం ఏర్పడిందని వివరించారు.

## ఢిల్లీ చేరుకున్న చంద్రబాబు.. అమిత్ షాతో భేటీ

-మొదటిపేజీ తరువాయి

నివాసానికి చేరుకున్నారు. ఈరోజు రాత్రి 9.30 గంటలకు కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో చంద్రబాబు భేటీ కానున్నారు. రేపు(బుధవారం) పలువురు కేంద్ర పెద్దలతో ముఖ్యమంత్రి భేటీ అవుతారు. రేపు ఉదయం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ , కేంద్ర మంత్రి నిర్మల సీతారామన్‌లని కలవనున్నారు. ఇంకా పలువురు కేంద్ర మంత్రులతో సీఎం అపాయింట్మెంట్లు ఖరారయ్యాయి. చంద్రబాబు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక సాయం కోరనున్నట్టుగా జాతీయ మీడియా ప్రచారం చేస్తుంది. బీహార్ , ఏపీకి 23 వ తేదీన నిర్మల ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో ప్రత్యేక సాయం ప్రకటించే అవకాశం ఉన్నట్లు సమాచారం. విభజన సమస్యల పరిష్కారం, ఇతర రాజకీయ అంశాలపై చర్చించనున్నారు. ఏపీకి ప్రత్యేక సాయంపై మోదీ , అమిత్ షా , నిర్మలతో చంద్రబాబు ప్రస్తావించే అవకాశం ఉందంటూ జాతీయ ఛానళ్ల కథనాలు ప్రసారం చేస్తున్నాయి. రెండు వారాల వ్యవధిలోనే రెండోసారి హస్తిన బాట పట్టడంతోచంద్రబాబు పర్యటనపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

## టిటిడి మఠాల భూములను పెద్దిరెడ్డే ఆక్రమించాడు

**అమరావతి :** గత ఐదేళ్లలో వైసిపి నేతలు భారీ భూదోపిడీకి పాల్పడ్డారని మంత్రి రామ్ ప్రసాద్ రెడ్డి మండిపడ్డారు. గత ప్రభుత్వంలో భూదోపిడీలో వైసిపి మంత్రులు, ఎంఎల్ఎలు కీలక పాత్ర పోషించారని, వైసిపి మాజీ ఎంఎల్ఎలు పెద్దిరెడ్డి, మిథున్ రెడ్డి చిత్తూరు జిల్లాల్లోనే మూడ వేల ఎకరాలు దోచుకున్నారని ఆరోపణలు చేశారు. టిటిడి మఠాల భూములను పెద్దిరెడ్డి కుటుంబం వదల్లేదని, చట్టపరంగా విచారణ జరిపి త్వరలోనే వారిపై చర్యలు తీసుకుంటామన స్పష్టం చేశారు. ఇప్పటికే రెవెన్యూ, దేవాదాయ అధికారులు విచారణ ముమ్మరం చేశారని, ఎపిలో ఉన్న గ్రానైట్ కొండలన్నీ పెద్దిరెడ్డే హస్తగతం చేసుకున్నారని, తమ భూములు కబ్జాకు గురయ్యాయని ఫిర్యాదు చేసే కాపాడుతామని ఆయన స్పష్టం చేశారు. భూములు, ఇసుక, మైనింగ్ దోపిడీకి పాల్పడిన వారిని వదిలిపెట్టమని హెచ్చరించారు. మైనింగ్ శాఖలో అవినీతిపై ఇప్పటికే విచారణ జరుగుతోందన్నారు.ఆర్‌టిసి నుంచి ఎలక్ట్రిక బస్సులు నడిపేందుకు సంస్థలతో చర్చిస్తున్నామని, గత ఐదేళ్లలో ఆర్‌టిసిని జగన్ ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసిందని రామ్ ప్రసాద్ రెడ్డి ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం రాగానే 200 వరకు కొత్త బస్సులు రోడ్డెక్కాయని, మరో 1200 కొత్త బస్సులు రోడ్డెక్కనున్నాయని వివరించారు.

## లెక్చరర్ పోస్టుల భర్తీకి లైన్ క్లియర్..!!

-మొదటిపేజీ తరువాయి

భవిష్యత్ అగమ్యగోచరంగా మారింది. కాలేజీల్లో డ్రగ్స్ నియంత్రణకు మరింత పటిష్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. ప్రత్యేకంగా నోడల్ ఆఫీసర్ల నియామకం అంశాన్ని పరిశీలించాలని సూచించారు. రాష్ట్రంలో ఉన్నతవిద్యశాఖ పరిధిలో నెలకొన్న సమస్యలపై మంగళవారం మంత్రి లోకేష్ అధికారులతో సమీక్ష నిర్వహించారు.

**లెక్చరర్ పోస్టుల భర్తీ..!!**

'డ్రగ్స్‌పై విద్యార్థులను చైతన్య పరిచేందుకు స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకోవాలి. రాష్ట్రవ్యాప్తంగా 3220 లెక్చరర్ పోస్టుల భర్తీ కోసం తీసుకోవాల్సిన చర్యలపై చర్చ జరిగింది. న్యాయపర చిక్కులను తొలగించి త్వరగా పోస్టుల భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలి. రాజకీయ ప్రమేయం లేకుండా నియామకం జరగాలి. ప్రతిభ ఆధారంగా, పారదర్శకంగా పోస్టుల భర్తీ ప్రక్రియ చేపట్టాలి. యూనివర్సిటీలకు సంబంధించి అకడమిక్ ఇయర్, ఎగ్జామినేషన్ షెడ్యూల్, క్యాలండర్ రూపొందించాలి. నిర్ణీత సమయంలో పరీక్షలు నిర్వహణ, ఫలితాల ప్రకటన చేపట్టేందుకు చర్యలు చేపట్టాలి అని' అధికారులకు మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు.

**తగ్గిన డిగ్రీ ప్రవేశాలు**

'గత ఐదేళ్ల నుంచి ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో అడ్మిషన్స్ తగ్గాయి. అడ్మిషన్స్ అంశాన్ని సీరియస్‌గా తీసుకోవాలి. అడ్మిషన్లను పెంచేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలి. ఉన్నత విద్యా సంస్థల వివరాలు, మౌలిక సదుపాయాలు, అడ్మిషన్లు, కోర్టు కేసుల వివరాలను డ్యాష్ బోర్డులో పొందుపర్చాలి. ఇంజనీరింగ్ కాలేజీల్లో అడ్మిషన్ల ప్రక్రియ, ఫీజులు ఏ మేరకు ఉండాలి, రాష్ట్రంలో ప్రైవేటు యూనివర్సిటీల పనితీరు, అప్రెంటీస్ షిప్ ఎంబెడెడ్ డిగ్రీ ప్రోగ్రామ్ కోసం కాలేజీల ఎంపిక గురించి చర్చ జరిగింది అని' మంత్రి నారా లోకేశ్ తేల్చి చెప్పారు. ఇదే కాక ఆంధ్రప్రదేశ్‌లో శ్రీ పొట్టి శ్రీరాములు, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఏర్పాటు అంశాలపై మంత్రి నారా లోకేశ్ సమీక్షించారు.

## బాలినేని నైరాశ్యం..

**ఒంగోలు :** మాజీ మంత్రి బాలినేని వైసీపీని వీడుతారా? ఈ విషయాన్ని హై కమాండ్ కు తేల్చి చెప్పారా? అందుకే జగన్ సమీక్షల్లో బాలినేని కనిపించడం లేదా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. ఈ ఎన్నికలకు ముందు నుంచే పార్టీ హైకమాండ్ పై అసంతృప్తితో ఉన్నారు బాలినేని. ఈ ఎన్నికల్లో దారుణంగా పరాజయం పాలయ్యారు. ఇప్పటికీ బాలినేనిని హై కమాండ్ పెద్దగా నమ్మడం లేదు. అందుకే జిల్లా పార్టీ అధ్యక్షుడిగా చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని నియమించేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఒంగోలు ఎంపీగా పోటీ చేసిన చెవిరెడ్డి ఓడిపోయారు. ఈ నేపథ్యంలో చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని జిల్లా అధ్యక్షుడిగా నియమించడంపై బాలినేని తో పాటు వైసిపి స్థానిక నాయకులు వ్యతిరేకిస్తున్నట్లు సమాచారం.బాలినేని శ్రీనివాస్ రెడ్డి జగన్ కు సమీప బంధువు. జగన్ బాబాయ్ వైవి సుబ్బారెడ్డికి స్వయానా బావ అవుతారు బాలినేని. గత ఎన్నికలకు ముందు వైవి సుబ్బారెడ్డి తో బాలినేనికి విభేదాలు తలెత్తాయి. ఈ క్రమంలో అప్పటి ఎంపీ మాగుంట శ్రీనివాసుల రెడ్డితో బాలినేని ఐక్యతగా ఉండేవారు. ఒంగోలు ఎంపీ స్థానం నుంచి వైసీపీ అభ్యర్థిగా మాగుంట, అసెంబ్లీ స్థానం నుంచి బాలినేని పోటీ చేయాలని భావించారు. కానీ బాలినేని విన్నపాన్ని జగన్ అంగీకరించలేదు. దీంతో బాలినేని పార్టీ నుంచి బయటకు వెళ్లిపోతారని ప్రచారం జరిగింది. బాలినేనిని బుజ్జగించారు జగన్. మాగుంట శ్రీనివాసుల రెడ్డికి టికెట్ లేదని చెప్పడంతో ఆయన టిడిపిలో చేరిపోయారు. అయితే అనూహ్యంగా చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని తెరపైకి తెచ్చారు జగన్. కానీ ఆయన అభ్యర్థిత్వాన్ని బాలినేని వ్యతిరేకించారు. వైసిపి నాయకత్వం ఒత్తిడి మేరకు వెనక్కి తగ్గారు బాలినేని. ఇప్పుడు ఎన్నికల్లో పార్టీ ఘోర పరాజయంతో బాలినేని పునరాలోచనలో పడ్డారు. సరిగ్గా అదే సమయంలో చెవిరెడ్డికి జిల్లా బాధ్యతలు అప్పగించడంతో.. కీలక నిర్ణయం దిశగా అడుగులు వేస్తున్నారు.2014 ఎన్నికల్లో సైతం బాలినేని ఓడిపోయారు. అప్పుడే నియోజకవర్గానికి కొద్ది రోజులు పాటు దూరంగా ఉండిపోయారు. ఈ న్నికల్లో అంతకుమించి పరాజయం ఎదురు కావడంతో నియోజకవర్గానికి దూరం అవుతారని ప్రచారం జరుగుతోంది. జూన్ 4న ఫలితాలు వస్తే.. దాదాపు 40 రోజుల తర్వాత ఆయన సొంత నియోజకవర్గంలో అడుగుపెడుతున్నారు. అయితే ఆయన ఇప్పుడు ఒంగోలు నగర రాజకీయాల గురించి పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. పార్టీ కార్యక్రమాలకు హాజరు కూడా లేకుండా పోతోంది. నగర మేయర్ తో పాటు మెజారిటీ కార్పొరేటర్లు టిడిపి గూటికి వెళ్లేందుకు సిద్ధపడినట్లు సమాచారం. చాలామంది కార్పొరేటర్లు టిడిపి ఎమ్మెల్యే జనార్ధనకు టచ్ లోకి వెళ్లినట్లు తెలుస్తోంది. ఇదే విషయాన్ని మేయర్ బాలినేనికి చెప్పగా పెద్దగా పట్టించుకోలేదని సమాచారం.బాలినేని ప్రకాశం జిల్లా బాధ్యతలు తనకు మాత్రమే అప్పగించాలని చాలా సందర్భాల్లో వైసీపీ హై కమాండ్ కు తేల్చి చెప్పారు.

షణ్ముఖ వెలుగు
ePaper www.shanmukhavelugu.com
3 | 17.07.24 బుధవారం

షణ్ముఖ వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు — తెలుగు దినపత్రిక
ప్రకాశం

# అధికార మదంతో నిందలు వేయొద్దు

- చేతనైతే నిరూపించండి
- మా కోడలు ఏ తప్పు చేయలేదు
- రాజుపాలెంలో డీకే భూములు నిరూపిస్తా
- మాకు 1973 లోనే కారు ఉంది
- ఇంటి పట్టాలు దొంగ పట్టాలు అంటారా
- మా పార్టీలోనే తీరని అన్యాయం జరిగింది
- అన్ని త్వరలో బయటపెడతా
- కార్పొరేటర్లకు కాపలా ఉండలేను కదా
- దామచర్ల పై బాలినేని ధ్వజం



**(షణ్ముఖ వెలుగు బ్యూరో, ప్రకాశం, జులై 16)**
అధికార మదంతో తనపై భూకబ్జా ఆరోపణలు చేస్తున్నారని, ధైర్యముంటే వాటిని నిరూపించాలని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ కు మాజీ మంత్రి బాలినేని శ్రీని వాసులురెడ్డి సవాల్ విసిరారు. బాలినేని తన నివాసంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ దామచర్ల తన మీడియా సమావేశంలో తనపై వచ్చిన హవాలా మంత్రి అనే విమర్శ గురించి ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. భూ కబ్జా చేసిన సూర్య ప్రకాశ్ రెడ్డి గురించి ఎందుకు మాట్లాడలేదు అన్నారు. బ్రాహ్మణుడి నుంచి తీసుకున్న అప్పుల గురించి అది తన సొంత విషయమని, ఎందుకు దాటవేశారు అని ప్రశ్నించారు. హైదరాబాదులో మణికొండలో దామచర్ల జనార్ధన్ మైనార్టీల వద్ద నుండి తీసుకున్న భూమి గురించి తాను ఎప్పుడు ప్రశ్నించలేదన్నారు. రాజుపాలెంలో దామచర్లకు చెందిన భూమిలో డీకేలు లేవా అని ప్రశ్నించారు. శ్రీకరి విల్లాస్‌లో 24 సెంట్లు ప్రభుత్వ భూమి ఉందని ప్లాన్లో చూపమని చెప్పారు. నిజాలు ఒప్పుకోవటానికి కూడా ధైర్యం కావాలన్నారు. సుబ్బారావు గుప్తాకి తన పై చొక్కా విప్పుకొని విమర్శలు చేసే స్థాయి అని ప్రశ్నించారు. (తరువాయి 4లో...)

# ప్రజలు, పోలీసుల సహకారం మరువలేను

## జిల్లా ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్

బదిలీ పై వెళ్తున్న ప్రకాశం జిల్లా ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్‌కి ఘనంగా ఆత్మీయ వీడ్కోలు పలికిన జిల్లా పోలీసు శాఖ




**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జులై 16)**
ఇటీవల జరిగిన సాధారణ బదిలీల నేపథ్యంలో మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్‌కి పోలీస్ అధికారులు, సిబ్బంది ఘనంగా ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ మాట్లాడుతూ 2024 సార్వత్రిక ఎన్నికల్లో పోలీస్‌లు అధికారులు, సిబ్బంది సంపూర్ణ సహకారం అందించడం వలన ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా నిర్వహించగలిగామని, పోలీస్ యంత్రాంగం సహకారాన్ని జిల్లా ఎస్పీ కొనియాడారు. శాంతి భద్రత, నేరాల నియంత్రణ, బందోబస్తు, ఎలక్షన్ సమయంలో సిబ్బంది సమర్థవంతంగా విధులు నిర్వహించారని, దీనికి హెూంగార్డు స్థాయి నుంచి అడిషనల్ ఎస్పీ వరకు ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ప్రతి ఒక్కరూ అంకిత భావం, నిబద్ధతతో మరింత ఉత్సాహంతో విధులు నిర్వహించాలని, విధుల్లో ఎలాంటి సవాళ్లు ఎదురైనా వాటిని అధిగమించి ముందుకు సాగాలని, కొత్త చట్టాలపై పూర్తి అవగాహన పెంచుకొని ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ (తరువాయి 4లో...)

# జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులకు భూసేకరణ ప్రక్రియ చేపట్టాలి

## జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జులై 16)**
జిల్లాలో వివిధ జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్ట్స్‌కు సంబంధించి చేపట్టిన భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసేందుకు సంబంధిత రెవెన్యూ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం కలెక్టరేట్లోని కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాల్ క్రిష్ణతో కలసి రెవెన్యూ డివిజనల్ అధికారులు, ఎస్.డి.సి లు, అటవీ శాఖ అధికారులు, ఐటిడిఏ, సర్వే అండ్ లాండ్ రికార్డ్స్ అధికారులతో సమావేశమై, జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్ట్స్ కు సంబంధించి చేపట్టిన భూసేకరణ ప్రక్రియ పురోగతి, 22 ఏ డిలీషన్స్, సిసిఆర్సి కార్డ్స్ జారీ , మీకోసం అర్జీల పరిష్కారం, మీ సేవ, సచివాలయాల సర్వీసెస్, ఆర్ఓఎఫ్ఆర్ క్లయిమ్స్ పెండింగ్, కోర్టు కేసులు తదితర అంశాలపై సమీక్షించి (తరువాయి 4లో...)



# రొట్టెల పండుగకు సర్వం సిద్ధం

## 2000 మంది పోలీసు ఫోర్స్‌తో పటిష్ట బందోబస్తు

రొట్టెల పండుగ బందోబస్త్ సిబ్బందికి బ్రీఫింగ్ నిర్వహించిన జిల్లా ఎస్పీ జి కృష్ణకాంత్



**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జులై 16)**
రొట్టెల పండుగకు సర్వం సిద్ధమైంది. ఈ సందర్భంగా రొట్టెల పండుగ బందోబస్త్ సిబ్బందికి జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్ బ్రీఫింగ్ నిర్వహించారు. రొట్టెల పండుగకు 2000 మంది పోలీసు ఫోర్స్‌తో పటిష్ట బందోబస్త్ నడుమ సర్వం సన్నద్ధం చేశారు. బారాషాహీద్ దర్గా రొట్టెల పండుగ ఈ నెల 17వ తేదీ నుంచి 21వరకు జరగనుంది. మెయిన్ దర్గా, ఘాట్ ఏరియా, ట్రాఫిక్ , పార్కింగ్ ఏరియాలను సెక్టార్ లుగా విభజించి నిర్వహించాల్సిన విధులను క్షుణ్ణంగా ఎస్పీ వివరించారు. ఐదు రోజులు పాటు జరిగే ఈ ఉత్సవాలలో ప్రధానమైన గంధ మహెూత్సవం నాడు మరింత పటిష్ఠంగా విధులు నిర్వహించాలని ఆదేశాలు ఇచ్చారు. దర్గా ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్‌లలో ఉండే రద్దీకి తగ్గట్లుగా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. దర్గా పరిసర ప్రాంతాలు డ్రోన్ , 52-సీసీ కెమెరాల నిఘా నీడలో 24 గంటల పాటు కంట్రోల్ రూం పర్యవేక్షణ ఉంటుందన్నారు. రొట్టెల పండుగలో వాహనాల పార్కింగ్ అనేది కీలకం. బయట నుండి వచ్చే వాహనాలకు కేటాయించిన పార్కింగ్ ప్రదేశాలలో మాత్రమే ఉంచాలన్నారు. 3-ముఖ్యమైన ట్రాఫిక్ డైవర్షన్ పాయింట్స్, 25 పార్కింగ్ ప్రదేశాలు, 12 మేజర్, 13 మైనర్ పార్కింగ్ ప్రదేశాలను, మొబైల్ పార్టీలు-17, 75 సాధారణ ట్రాఫిక్ రెగులేషన్ పాయింట్‌లను గుర్తించాలన్నారు. సెక్టార్ ఇంచార్జి ఆఫీసర్‌లు షిఫ్ట్ లకు అతీతంగా సిబ్బందికి బ్రీఫింగ్ నిర్వహించి విధులలో నిమగ్నం చేయాలని, అదేవిధంగా విధులు అనంతరం కూడా సెక్టార్ సిబ్బంది అందరికీ డీ-బ్రీఫింగ్ నిర్వహించాలని ఆదేశాలు ఇచ్చారు. అందరూ మాన్ పాక్స్, పబ్లిక్ అడ్రెస్స్ సిస్టం ను విరివిగా ఉపయోగించి కమ్యునికేషన్ గ్యాప్ లేకుండా చూసుకోవాలన్నారు. (తరువాయి 4లో...)

# ఉద్యోగి ఆరోగ్యం కాపాడటం సంస్థ బాధ్యత



జిల్లా విద్యుత్ శాఖ సూపరింటిండెంట్ ఇంజనీర్ కేవీజి సత్యనారాయణ
200 మంది విద్యుత్ ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యులకు వైద్య పరీక్షలు

(తరువాయి 4లో...)

# అధికార మదంతో నిందలు వేయొద్దు



మాజీ మంత్రిపై ఆరోపణలు చేస్తుంటే పోలీసు వ్యవస్థ ఏం చేస్తుందో అర్థం కావటం లేదన్నారు. గత ఎన్నికల్లో మా కోడలు ఎవర్ని చెప్పుతో కొట్టలేదు అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలలో ఆడవాళ్లు గొడవపడిన నేనే బాధ్యత వహించాలా అన్నారు. కేసులు మేము లెక్క చేయమన్నారు. 2019 ఎన్నికల తర్వాత రెండు సంవత్సరాల పాటు ఒంగోలు వదిలి పెట్టి పారిపోయింది నీవు కాదా అని జనార్ధన్ పై ధ్వజమెత్తారు. కరోనా సమయంలో ప్రజలకు ఏం మేలు చేశావన్నారు. 1973లోనే తమకు అంబాసిడర్ కారు ఉందన్నారు. తాను రోజు కాలేజీకి కారులోనే వెళ్లే వాడిని అన్నారు. 1973లో మీ తాత పరిస్థితి ఏంటో చెప్పాలన్నారు. 1977లోనే తన తండ్రి ఒంగోలులో ఎక్కడా లేని విధంగా భారీగా ఇల్లు నిర్మించారన్నారు. ఇదే ఇంటిలో సినీ దర్శకులు టి. కృష్ణ మూడు సినిమాలు తీశారన్నారు. తాను, తన కుటుంబ సభ్యులు ఎవరు వ్యాపారాలు చేసుకోవద్దా అని ప్రశ్నించారు. ఇంటి పట్టాలిస్తే అవి దొంగ పట్టాలని ప్రచారం చేస్తున్నారన్నారు. వాటికి నిధులు తీసుకురాటానికి చాలా ఇబ్బందులు పడ్డామన్నారు. మా పార్టీ లోనే నాకు అన్యాయం జరిగిందని బాలినేని చెప్పుకొచ్చారు. చాలా ఇబ్బందులు పడ్డాను అన్నారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి పై ఉన్న గౌరవంతో అన్నింటినీ మౌనంగా భరించాను అన్నారు. త్వరలో అన్ని బయట పెడతానన్నారు. టిడిపిలోకి పోకుండా వైసిపి కార్పొరేటర్లకు తాను కాపలా కాయాలా అన్నారు. నిజాయితీగా ఉండేవాడు తమ పార్టీలో ఉంటారన్నారు. చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ స్పందించి తనపై వస్తున్న ఆరోపణలు నిరూపించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కటారి శంకర్, డిప్యూటీ మేయర్ వెలనాటి మాధవరావు, బోట్ల సుబ్బారావు, గంటా రామానాయుడు, గొర్రెపాటి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

# రొట్టెల పండుగకు సర్వం సిద్ధం



అందరూ సమయపాలన పాటిస్తూ, ప్రతి ఒక్కరు ఐడీ కార్డు, విజిల్, రైన్ కోట్, డ్యూటీ పాస్ పోర్ట్ లతో ఎవరికి నిర్ణయించిన ప్రదేశాలల్లో వారు తప్పక హాజరుగా ఉండాలన్నారు. ఎవరైనా అలసత్వం ప్రదర్శించిన, గైర్హాజరు అయినట్లయితే తప్పకుండా శాఖా పరమైన చర్యలు తీసుకోబడతాయన్నారు. పోలీసు సిబ్బంది మానవతాదృక్పదంతో వ్యహరించి విధులు నిర్వహించాలన్నారు. బోటింగ్ పాయింట్‌లలో కెపాసిటీకి మించి, లైఫ్ జాకెట్‌లు లేకుండా యాత్రికులు బోటు షికారు చేయనీకూడదన్నారు. ఇతర విభాగాలతో సమన్వయము చేసుకుంటూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్త్ విజయవంతం చేయాలని సూచనలు ఇచ్చారు. సెంట్రల్ క్రైం స్టేషన్ అధికారులు, సిబ్బంది ఈ ఉత్సవాలలో జరిగే దొంగతనాలు మరియు నేరాలను అరికట్టే క్రమంలో ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశాలు ఇచ్చారు. బాంబ్, డాగ్ స్క్వాడ్ లతో యాంటీ సబోటేజ్ చెకింగ్, ఆర్వోపీలచే ముమ్మర తనిఖీలు చేపట్టారు. మొత్తం బందోబస్త్ పోలీసు సిబ్బంది, అధికారులకు అనుకూలంగా ఉండేలా తగిన వసతితో పాటు జిల్లా యస్.పి. భోజనాల ఏర్పాట్లు చేశారు. అనంతరం ఎస్పీ దర్గా లోపల, చుట్టు ప్రక్కల పరిసరాలను సందర్శించి అధికారులకు తగిన సూచనలు చేశారు.



# ప్రజలు, పోలీసుల సహకారం మరువలేను





జిల్లా పోలీస్ శాఖ ప్రతిష్ట పెంచాలని ఆకాక్షించారు. బదిలీపై జిల్లా వదిలి వెళ్లినప్పటికీ ఎప్పుడు ఏ సాయం కావాలన్నా తన పరిధిలో చేయడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు. ఎన్నికల విధి నిర్వహణలో జిల్లా ఎస్పీ సహకారం, దిశానిర్ధేశం మరువలేనిదని, పోలీస్ సిబ్బందికి సదా అండగా నిలిచి తమలో మానసిక స్థైర్యాన్ని పెంపొందించారని, సిబ్బంది సంక్షేమానికి విశేష కృషి చేసారని ఎస్పీ ని పోలీస్ అధికారులు, సిబ్బంది కొనియాడారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె. నాగేశ్వరరావు, అడిషనల్ ఎస్పీ (క్రైమ్ )ఎస్ వి. శ్రీధర్ రావు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్ బాబు, డీపీఓ ఏఓ సులోచన, డిఎస్పీలు కిషోర్ బాబు, రామరాజు, అశోక్ వర్ధన్, బాల సుందరం, పోలీస్ లీగల్ అడ్వైజర్ వేణుగోపాల్, సీఐలు, ఆర్ఐలు, తదితరులు పాల్గొన్నారు.

# తొలి ఏకాదశి శుభాకాంక్షలు మాగుంట రాఘవరెడ్డి



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 16)** హిందువుల తొలి పండుగగా ఖ్యాతిచెందిన తొలి ఏకాదశి పండుగకు ప్రత్యేక స్థానముందన్నారు. ఏడాదిలో వచ్చే 24 ఏకాదసులలో ఆషాఢ శుద్ధ ఏకాదశి నాటి నుంచి శ్రీ మహా విష్ణువు నాలుగు నెలలపాటు క్షీర సాగరంలో శేషతల్పంపై శయనిస్తాడు. ఈ రోజున ఉపవాసం వుండి, జాగరణ చేసి, శ్రీ మహా విష్ణువును పూజించినచో విశేష ఫలితాలు మనకు కలుగుతాయని పురాణాలు తెలియజేస్తూన్నాయి. జిల్లా ప్రజలందరూ తొలి ఏకాదశి రోజున ఉపవాసం వుండి, జాగరణ చేసి, శ్రీ మహావిష్ణువును పూజించి విశేష ఫలితాలు పొందాలని కోరుతూ ప్రజలకు ఎంపీ మాగుంట కుమారుడు మాగుంట రాఘవరెడ్డి తొలి ఏకాదశి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

# అరుణాచలేశ్వర ఆలయాన్ని సందర్శించిన కనిగిరి వైసీపీ ఇన్చార్జి దద్దాల

## కనిగిరి నియోజకవర్గం ప్రజల కోసం ప్రత్యేక పూజలు





**(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జులై 16)** తమిళనాడు రాష్ట్రంలోని అరుణాచలం పంచభూతలింగ క్షేత్రాలలో ఒకటైన అరుణాచలేశ్వర్ దేవాలయాన్ని కనిగిరి వైసీపీ ఇన్చార్జి దద్దాల నారాయణ యాదవ్ మంగళవారం సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దక్షిణ భారతంలో వెలసిన పంచలింగ క్షేత్రాలలో ఒకటైన పుణ్యక్షేత్రాన్ని సందర్శించడం ఆనందంగా ఉందని అన్నారు. కనిగిరి నియోజకవర్గ ప్రజల కోసం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు వైసీపీ ఇన్చార్జి దద్దాల నారాయణ యాదవ్ తెలిపారు.

# జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులకు భూసేకరణ ప్రక్రియ చేపట్టాలి




పలు సూచనలు, ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో ముటేషన్, రీ సర్వే, వెబ్ లాండ్‌లో పేరు నమోదు తదితర భూ సమస్యలపై ప్రజల నుండి వచ్చే అర్జీలపై రెవెన్యూ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించదగిన సమస్యలను సత్వరం పరిష్కరించాలని, పరిష్కారం చేయలేనివి ఏ కారణం వలన పరిష్కారం చేయడం లేదో నిర్ధిష్టమైన కారణాలు సంబంధిత అర్జీదారులకు తెలియ చేయాలన్నారు. నిర్ధిష్టమైన కారణం లేకుండా ఏ ఒక్క దరఖాస్తును తిరస్కరించరాదని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. రెవెన్యూ అంశాలకు సంబంధించి ప్రజల వద్ద నుండి వచ్చే అర్జీలను మండల స్థాయిలో ఏ విధంగా పరిష్కరించబడుచున్నవో సంబంధిత రెవెన్యూ డివిజనల్ అధికారులు పూర్తి స్థాయిలో పర్యవేక్షణ చేయాలని జిల్లా కలెక్టర్, రెవెన్యూ డివిజనల్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో వివిధ జాతీయ రహదారులు , రైల్వే ప్రాజెక్ట్సుకు సంబంధించి చేపట్టిన భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేయుటకు సంబంధిత రెవెన్యూ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్, రెవెన్యూ డివిజనల్ అధికారులను ఆదేశించారు. ఎక్కడైతే భూ సేకరణ ప్రక్రియ పూర్తి కాబడిందో అక్కడ డ్రైవ్ మోడ్‌లో మ్యూటేషన్ ప్రక్రియను చేపట్టాలని కలెక్టర్ సూచించారు. 22ఏ డిలీషన్స్ ప్రక్రియలను నిర్ధేశించిన గడువు లోపు పరిష్కరించేలా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో నిర్ధేశించిన లక్ష్యం మేరకు సిసిఆర్సి కార్డ్స్ ను జారీ చేసేలా రెవెన్యూ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆర్ఓఎఫ్ఆర్ క్లెయిమ్స్ రీవెరిఫికేషన్ ప్రక్రియను రెవెన్యూ, అటవీ, ఐటిడిఏ అధికారులు సమన్వయంతో పనిచేసి త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కోర్టు కేసులపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, పెండింగ్లో వున్న కోర్టు కేసులపై డివిజన్ స్థాయిలో సమావేశం ఏర్పాటు చేసుకుని కోర్టు ఉత్తర్వులను అమలు చేసేలా రెవెన్యూ డివిజన్ అధికారులు ప్రత్యేక శ్రద్ద తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీన, జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర రావు, ఒంగోలు, కనిగిరి ఆర్డిఓ లు సుబ్బారెడ్డి, జాన్ ఇర్విన్, ఎస్డిసి లు శ్రీమతి ఝాన్సి లక్ష్మి, వరకుమార్, లోకేశ్వర రావు, డిఎఫ్ఓ శ్రీనివాసులు, డిటిడబ్ల్యూఓ జగన్నాధ రావు, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఎడి కిశోర్ బాబు, కలెక్టరేట్ భూసేకరణ విభాగం అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగి ఆరోగ్యం కాపాడటం సంస్థ బాధ్యత

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 16)**

విద్యుత్ భవన్‌లో ఉమ్మడి ప్రకాశం జిల్లా విద్యుత్ శాఖ సూపరింటిండెంట్ ఇంజనీర్ కేవీజి సత్యనారాయణ ఆధ్వర్యంలో జిల్లా విద్యుత్ ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యులకు ఉచితంగా కంటి, గుండెకి సంబంధించిన వైద్య పరీక్షలు నిర్వహించారు. అందులో భాగంగా సుమారు 200 మంది విద్యుత్ ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలు విషన్ స్మార్ట్, చైతన్య కార్డియాక్ సెంటర్ వారు సంయుక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్.ఈ మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి ఉద్యోగి సంస్థ కోసం ఎంతో కృషి చేస్తున్నారు. అలాంటి ఉద్యోగి ఆరోగ్యం కాపాడటం సంస్థ ముఖ్య బాధ్యత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ.ఈ లు హైమావతి, శ్రీనివాస్, కరీమ్, వీరయ్య, వైద్యులు నాగ మాధవి, కృష్ణ చైతన్య, విద్యుత్ ఉద్యోగులు పాల్గొన్నారు.





# సాయిబాబా విగ్రహా స్థాపనకు భక్తులు తరలిరండి



**(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జులై 16)** కనిగిరి శ్రీ షిరిడి సాయిబాబా సాయిబాబా దేవస్థానం బయట శ్రీకృష్ణ విగ్రహం వద్ద 12 అడుగుల బాబా విగ్రహాన్ని బుధవారం స్థాపన జరుగుతుందని సాయిబాబా దేవస్థానం అధ్యక్షుడు దేవకి సుబ్రహ్మణ్యం తెలిపారు. సాయిబాబా విగ్రహాన్ని వేద పండితుడు సంగుబోట్ల ఇందు కుమార్ శర్మ ధర్మపత్ని శ్రీలక్ష్మి విగ్రహాన్ని సమర్పించారని వారు తెలిపారు. ఈ సందర్భంగా ఇందు కుమార్ శర్మ మాట్లాడుతూ షిరిడి సాయిబాబా భక్తుడైన నా తండ్రి ఆశయాల కోసం 12 అడుగుల సాయిబాబా విగ్రహాన్ని బాబా దేవస్థానం వద్ద ఆవిష్కరించేందుకు నిర్ణయించామన్నారు. కనిగిరి షిరిడి సాయిబాబా దేవస్థానం నందు బుధవారం ఉదయం ఎనిమిది గంటలకు ఈ కార్యక్రమం జరుగుతుందని సాయిబాబా భక్తులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

## సర్వేపల్లిలో వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు

### టీడీపీలో చేరిన కోడూరు మేజర్ పంచాయతీ సర్పంచ్ యాటగిరి కృష్ణవేణి



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జులై 16)
సర్వేపల్లిలో వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలకు మొదలయ్యాయి. వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలోకి తోటపల్లి గూడూరు మండలం కోడూరు మేజర్ పంచాయతీ సర్పంచ్ యాటగిరి కృష్ణవేణి చేరారు. నెల్లూరు వేదాయపాలెం క్యాంప్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆత్మీయ ఆహ్వానం పలికారు. బిల్లులపై సంతకాల కోసం వైసీపీ నాయకులు పెట్టిన వేధింపులు తట్టుకోలేక ఊరువదిలి పెట్టి వరిగొండలో తలదాచుకుంటుంది సర్పంచ్ యాటగిరి కృష్ణవేణి. ఒక గిరిజన ప్రజాప్రతినిధికి వైసీపీ పాలనలో నిలువ నీడ లేకుండా చేయడం బాధాకరమని సోమిరెడ్డి పేర్కొన్నారు. కృష్ణవేణికి తెలుగుదేశం పార్టీలోకి ఆత్మీయ ఆహ్వానం పలుకుతున్నామన్నారు. కోడూరు పంచాయతీ అభివృద్ధికి మా సంపూర్ణ సహకారాలు ఉంటాయని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి హామీ ఇచ్చారు. వైసీపీ పాలనలో ఎదుర్కొన్న ఇబ్బందులను చెప్పుకుని సర్పంచ్ కృష్ణవేణి ఆవేదన వ్యక్తం చేశారు. మళ్లీ ఇప్పుడు గ్రామానికి వెళ్లి టీడీపీ ప్రభుత్వ సహకారంతో పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తానని సర్పంచ్ తెలిపారు.

## అన్నా క్యాంటీన్ నిర్వహణకు రూ.50 వేలు సాయం

### టిడిపి మహిళా నాయకురాలు రావుల పద్మజ



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 16)
రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలు తక్కువ ఖర్చుతో తన ఆకలని తీర్చుకోవడానికి ఏర్పాటు చేసిన అన్నా క్యాంటీన్ నిర్వహణకు, తన వంతు సహాయంగా టిడిపి మహిళ నాయకురాలు రావుల పద్మజ 50వేల రూపాయల చెక్కును ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌కు అందజేశారు. అనంతరం దామచర్ల మాట్లాడుతూ పేదల ఆకలి తీర్చేందుకు ముందుకు వస్తున్న దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. పేదల కోసం ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌లను ప్రతి పేదవాడు ఉపయోగించుకోవాలని కోరారు. ఈ సాయం అందజేసిన రావుల పద్మజకి కృతజ్ఞతలు తెలిపారు.

## అడవి ప్రాంతంలోకి ప్లాస్టిక్ వస్తువుల అనుమతి లేదు

### సబ్ డీఎఫ్‌వో వేణు



(షణ్ముఖ వెలుగు, పెద్ద దోర్నాల, జులై 16)
తొలి ఏకాదశి తిరునాళ్లకు హాజరయ్యే యాత్రికులు ప్లాస్టిక్ వస్తువులు తీసుకు రావద్దని సబ్ డి.ఎఫ్.ఓ వేణు సూచించారు. నాగార్జునసాగర్ –



శ్రీశైలం పెద్దపులుల అభయారణ్యం పరిధిలోని గంజివారిపల్లి అటవీక్షేత్రంలోని పాలంక ఉందన్నారు. తొలిఏకాదశి తిరునాళ్లకు వచ్చే భక్తులు ఎలాంటి ప్లాస్టిక్ వస్తువులు అనగా ప్లాస్టిక్ గ్లాసులు, ప్లాస్టిక్ ప్లేట్స్, ప్లాస్టిక్ లగేజీ సంచులు, ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్, ప్లాస్టిక్ వాటర్ పాకెట్స్, ప్లాస్టిక్ బిస్కెట్స్ పాకెట్స్, తదితర సింగిల్ యూస్ ప్లాస్టిక్‌ను తీసుకోని రావద్దని దోర్నాల సబ్ డి.ఎఫ్.ఓ వేణు ఒక ప్రకటనలో తెలిపారు. యాత్రికులు ప్రయాణించే వెహికల్‌లను చెక్ చేస్తుంటే మందు బాటిళ్లు బయటపడ్డాయన్నారు. ఆ మందు బాటిళ్లను సీజ్ చేసినట్లు సబ్ డి.ఎఫ్‌వో వేణు తెలిపారు. అదేవిధంగా పెద్దపులులు అభయ్యారణ్యంలో మద్యపానం, ధూమపానం, వంటవండుట, రాత్రిళ్ళు బస చేయుట నిషిద్ధమన్నారు. నడిచి వెళ్లే యత్రికులకు ప్రవేశం లేదన్నారు. బైకులకు రూ.200లు, జీపులకు రూ.800 పర్యావరణ నిర్వహణ రుసుం చెల్లించాలని తెలిపారు.

## గ్రానైట్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గా సుబ్బారావుకు బాలకృష్ణ "పట్టాభిషేకం"

### హిందూపురం ఎమ్మెల్యే పిఏకున్న విలువ దళిత ఎమ్మెల్యేకి లేదా?
### దళిత ఎమ్మెల్యే ఇలాఖాలో వియ్యంకుడి జోక్యం పై చంద్రబాబు స్పందించాలి
### దళిత నేత నీలం నాగేంద్ర డిమాండ్



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 16)
ప్రకాశం జిల్లా చీమకుర్తి సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా స్థానిక ఎస్సీ ఎమ్మెల్యే సిఫారసుని పక్కనబెట్టి హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ చెప్పిన సుబ్బారావుకు పోస్టింగ్ ఇవ్వడంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పందించాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు నీలం నాగేంద్రరావు డిమాండ్ చేశారు. మంగళవారం ఒంగోలులోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నాగేంద్ర మాట్లాడుతూ, చంద్రబాబు పాలనలో హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ పీఏకు ఉన్న విలువ దళిత ఎమ్మెల్యేకి లేకపోవడం సిగ్గుచేటన్నారు. తన పీఏ చెప్పాడని బాలకృష్ణ వేరే జిల్లా ఎమ్మెల్యే నియోజకవర్గ రాజకీయాల్లో జోక్యం చేసుకున్నాదన్నారు. దళితుడే అయినా సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ సీఐగా కమ్మ సామాజిక వర్గానికి చెందిన శ్రీనివాసరావుకు లెటర్ ఇచ్చారన్నారు. బాలకృష్ణ పీఏ హోదా ముందు సీనియర్ ఎమ్మెల్యేగా బిఎన్ విజయకుమార్ పవర్, సీఐ శ్రీనివాసరావు అధికార పార్టీ కులం కార్డు కూడా పనికిరాకుండా పోయాయన్నారు. వైసిపి పాలనలో కీలక స్టేషన్లు చేసిన అధికారుల్ని విధిగా మారుస్తున్న కూటమి పెద్దలు, దళిత ఎమ్మెల్యే ఇలాఖాలో లెక్క తప్పారన్నారు. నాలుగోసారి సీఎం పదవి చేపట్టిన చంద్రబాబు తాను మారిన మనిషినని తరుచూ చెప్తున్నారని, మారానంటున్న బాబు ఏలుబడిలో దళిత ఎమ్మెల్యేలకి మర్యాద, ప్రాధాన్యం పెరగలేదన్నారు. సుబ్బారావుపై బాలకృష్ణ, లోకేష్‌లకు ప్రేమ పొంగిపోతే, ఆయన్ను హిందూపురానికో, రాజధాని తుల్లూరుకో, మంగళగిరికో సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా పోస్టింగ్ వేయించు కోవాల్సిందన్నారు. విజయకుమార్ దళితుడు కాబట్టే, ముఖ్యమంత్రి వియ్యంకుడు బాలకృష్ణ చీమకుర్తి సీఐ పోస్టింగ్ విషయంలో జోక్యం చేసుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సీ రిజర్వుడు సంతనూతలపాడు నియోజకవర్గంలో చీమకుర్తి సీఐగా బాలకృష్ణ చెప్పిన అధికారికి పోస్టింగ్ ఇవ్వడమంటే దళితుల ఆత్మ గౌరవాన్ని సవాలు చేయడమేనని నాగేంద్ర మండిపడ్డారు. బిఎన్ విజయ్ కుమార్ నిషాని ఎమ్మెల్యే కాదని, ఇంజనీరింగ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ అని, రిటైర్డ్ ఐఏఎస్ దానం కుమారుడన్నారు. 2014, 2019, 2024 ఎన్నికల్లో కోట్ల రూపాయల సొంత డబ్బు ఖర్చు పెట్టి, టీడీపి అభ్యర్థిగా పోటీ చేశారన్నారు. జగన్ పోయి చంద్రబాబు వచ్చారేగానీ, దళితుల పట్ల మనువాదం, వివక్ష పోలేదన్నారు. ఈ సమావేశంలో మాలమహానాడు అధ్యక్షులు దారా అంజయ్య, దళిత నాయకులు కాకుమాను రవి, మక్కెన వర కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## హెల్మెట్ ధరించటం మన బాధ్యత

### జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్ పర్సన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ భారతి








(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 16)
హెల్మెట్ ధరించటం అనేది బరువు కాదు మన బాధ్యత అని, మన భద్రత అని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్పర్సన్ , జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ భారతి అన్నారు. ఒంగోలు పట్టణంలోని న్యాయస్థానం ప్రాంగణంలో హెల్మెట్ ధరించడం అనే అంశం మీద నిర్వహించిన ర్యాలీని ప్రారంభిస్తూ వాహన ప్రమాదాల మూలంగా కుటుంబాలు, దేశం ఆర్థికంగా ఎంతో భారం వస్తుందని అన్నారు. కుటుంబ వ్యవస్థకు మూలాధారమైన వ్యక్తులు రోడ్డు ప్రమాదాలలో గాయపడటం లేదా మరణించడం ద్వారా ఆ కుటుంబాలకు ఎంతో మనోవేదనతో పాటు ఆర్థికంగా కృంగిబాటికి గురవుతాయన్నారు. అదే విధంగా మోటార్ వాహన చట్టం సెక్షన్ 129 కింద నేరమని 194 (డి) ప్రకారం శిక్షలు విధించడం జరుగుతుందని, ప్రతి ఒక వాహనదారుడు విధిగా హెల్మెట్ ధరించాలని, దూరంతో సంబంధం లేకుండా ఈ నిబంధన పాటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎనిమిదో అదనపు జిల్లా న్యాయమూర్తి డి.అమ్మన్నారాజ మాట్లాడుతూ మొబైల్ ఫోన్ కొన్న ప్రతి వినియోగదారుడు ఏ విధంగా స్క్రీన్ గార్డ్ తో అందంగా అలంకరించుకుంటారు. అదేవిధంగా ప్రతి ఒక్క వాహనదారుడు వాహనం కొనగానే బాధ్యతగా హెల్మెట్ కొని ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.శ్యాంబాబు, అదనపు జూనియర్ సివిల్ న్యాయమూర్తులు, ఒంగోలు పట్టణ డిఎస్పి కిషోర్ బాబు, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ మాలకొండయ్య, లీగల్ ఎడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులు, బార్ అసోసియేషన్ న్యాయవాదులు, న్యాయశాఖ సిబ్బంది, న్యాయ సేవా సహాయకులు, పాల్గొన్నారు. ఈ ర్యాలీ ఒంగోలు పట్టణంలోని జిల్లా న్యాయస్థార ప్రాంగణం నుండి సిపిఎం రీడింగ్ రూం మీదుగా మున్సిపల్ ఆఫీస్ కవర్ చేస్తూ సెర్చ్ సెంటర్ వరకు జరిగింది.

## తాయమ్మ అవ్వకు శాకాంబరి అలంకారం



(షణ్ముఖ వెలుగు, ఆదోని, జులై 16)
ఆదోని పట్టణ వరల్డ్ ఆర్యవైశ్య మహాసభ (వామ్) మహిళా విభాగ్ ఆధ్వర్యంలో ఎస్‌కేడి కాలనీలో శ్రీ దర్శన్ లాల్ ధర్మకర్తగా ఉన్న తాయమ్మ గుడిలో ఆషాడ మాసం సందర్భంగా లోక కళ్యాణార్థం, వానలు సమృద్ధిగా కురవాలని ఆకాంక్షతో, తాయమవ్వకు






శాకంబరీ అలంకారం చేసి లలితా సహస్రనామం, దేవి ఖడ్గమాల స్తోత్రం పారాయణం చేసి, తీర్థ ప్రసాద వినియోగం చేశామని ఆదోని పట్టణ వామ్ అధ్యక్షురాలు వంకదారి మమతా శ్రీ తెలిపారు. వామ్ ఉపాధ్యక్షురాలు ఇల్లూరి అనిత శ్రీనివాసులు దంపతులు కాలనీవాసుల సహాయంతో అమ్మ వారికి 'శాకంబరీ" అలంకారము ఎంతో అద్భుతంగా చేసినందుకు దేవస్థానము ధర్మకర్తలు ప్రసాద వినియోగానికి, పెద్ద ఎత్తులో హాజరైన పురవాసులు భక్తి తన్వయంతో ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వామ్ అధ్యక్ష కార్యదర్శులు వంకదారు మమతా శ్రీ, ఎన్ శ్రీదేవి, కోశాధికారి అనూష, సభ్యులు అనిత, సంతోషితో పాటు ఎస్‌కేడీ కాలనీ వాసులు, పుర ప్రజలు భక్తి ప్రపత్తులతో పాల్గొన్నారు.

## తొలి ఏకాదశి శుభాకాంక్షలు

### ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 16)
హిందువుల తొలి పండుగగా ఖ్యాతిచెందిన తొలి ఏకాదశి పండుగకు ప్రత్యేక స్థానమున్నదని, సంవత్సరంలో వచ్చే 24 ఏకాదసులలో ఆషాడ శుద్ధ ఏకాదశి నాటి నుంచి శ్రీ మహా విష్ణువు నాలుగు నెలలపాటు క్షీర సాగరంలో శేష తల్పంపై శయనిస్తాడు. ఈ రోజున ఉపవాసం ఉండి, జాగరణ చేసి, శ్రీ మహా విష్ణువును పూజించినచో విశేష ఫలితాలు మనకు కలుగుతాయని పురాణాలు తెలియజేస్తున్నాయని ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి తెలిపారు. జిల్లా ప్రజలందరూ తొలి ఏకాదశి రోజున ఉపవాసం ఉండి, జాగరణ చేసి, శ్రీ మహావిష్ణువును పూజించి, విశేష ఫలితాలు పొందాలని కోరుతూ ప్రజలకు తొలి ఏకాదశి పండుగ శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు ఎంపీ మాగుంట తెలిపారు.

## పంచాయతీలో నిధులు కాజేసిన సిబ్బంది నుంచి నిధులు రాబట్టాలి

### వీరభద్రాచారి డిమాండ్



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 16)
జిల్లాలో అనేక పంచాయతీల్లో ఇంటి పన్నులు, ఇతరత్రా ప్రజాధనాన్ని లక్షల్లో కాజేసిన పంచాయితీ కార్యదర్శులు, ఇతర సిబ్బంది నుంచి వెంటనే నిధులు రాబట్టాలని సర్పంచుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జి. వీర భద్రా చారి డిమాండ్ చేశారు. మంగళ వారం సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జిల్లా అధికారుల అండతో వారు బదిలీ పై వెళ్లి మరలా అక్కడ కూడా యదేచ్ఛగా అవినీతి కార్యక్రమాలు చేస్తూ సర్పంచులును బెదిరిస్తున్నారని అన్నారు. సర్పంచులు, ప్రజలు ఎన్ని ఫిర్యాదులు చేసినా చర్యలు శూన్యంగా, అవినీతి అధికారులకు మద్దతు గా పని చేయడం విచారకరమన్నారు. ఉమ్మడి జిల్లాలో మేజర్, మైనర్ పంచాయితీలలో కార్యదర్శి, బిల్ కలెక్టర్, ఇతర సిబ్బంది నుంచి సుమారు రెండు కోట్లకు పైగా రెండు, మూడేళ్ల నుంచి తేల్చిన కాజేసిన సొమ్ము రాబట్టడంలో జిల్లా అధికారులు విఫలమవడమే కాక వారికి తో కుమ్మక్కవడం దుర్మార్గమని, తక్షణమే పంచాయితీలలో ప్రజాధనాన్ని తిరిగి రాబట్టాలని వీరభద్రాచారి జిల్లా కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారిని డిమాండ్ చేశారు.

## గొర్రెలు, మేకల షెడ్ల నిర్మాణానికి 90% రాయితీ ఇవ్వాలి

### యూనిట్ వ్యయం రూ.3 లక్షలకు పెంచాలి



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 16)
గొర్రెలు, మేకల షెడ్ల నిర్మాణానికి 90% రాయితీ ఇవ్వాలని, యూనిట్ వ్యయం 3 లక్షలకు పెంచాలని ఏపీ గొర్రెలు, మేకల పెంపకం దారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి కిలారి పెద్దబ్బాయి, జిల్లా కార్యదర్శి తోట తిరుపతిరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పశువులు షెడ్లు నిర్మాణానికి 90% రాయితీ ఇవ్వాలని, గొర్రెలు, మేకలు, కోళ్ళకి 70% రాయితీ ఇవ్వాలని నిర్ణయించి జులై ఒకటో తేదీన పంచాయతీరాజ్ శాఖ ద్వారా ఉత్తర్వులు మార్గదర్శకాలు విడుదల చేశారు. ఇందులో పశువులకు ఎక్కువ రాయితీ, సన్న జీవాలకు తక్కువ రాయితీ ఇవ్వడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. అన్ని రకాల షెడ్లు ప్రభుత్వం చెప్పిన ప్రకారమే నిర్మించాలన్నారు. ఖర్చు కూడా పశువులకు ఎంత అవుతుందో వీటికి కూడా అంతే ఖర్చుఅవుతుంది. మరి అలాంటప్పుడు ఎందుకు వీటి మధ్య రాయితీలో తేడా పెట్టారనేది ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. 2019లో టిడిపి ప్రభుత్వం హయాంలో గోకులం పేరుతో షెడ్లు నిర్మించారు అప్పుడు అన్ని పశువులకు సన్న జీ వాలకు ఒకటే విధంగా 90% రాయితీ ఇచ్చారు. లోకేష్ ప్రజా గళం మేనిఫెస్టోలో హామీ ఇచ్చారు. గొర్రెల, కాపరుల పట్ల ప్రభుత్వానికి ఎందుకు ఈ చిన్న చూపు పెంపకం దారుల్లో ఎక్కువమంది సన్నా,చిన్న కారు రైతులే 30% శాతం మార్జిన్ కట్టాలంటే కట్టలేని పరిస్థితి ఉంటుంది. అంతేగాక యూనిట్ వ్యయం మాక్సిమం 2, లక్షల30,000 పెట్టారు ఇది ఏమాత్రం సరిపోదు అన్ని రకాల మెటీరియల్స్ ధరలు పెరిగాయి పెరిగిన ధరలకు అనుగుణంగా యూనిట్ వ్యయాన్ని కనీసం 3, లక్షలకు తగ్గకుండా మార్పులు చేయాల్సిన అవసరం ఉందన్నారు. గొర్రెల సంఖ్య కేటగిరీకి సంబంధించి 20,50 గొర్రెల వరకే ఇస్తామని చెబుతున్నారు. కనీసం 100 గొర్రెల వరకు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. అందువలన రాష్ట్ర ప్రభుత్వం మరొకసారి పరిశీలన చేసి అన్ని రకాల పశువులకు 90 %శాతం రాయితీ వర్తించే విధంగా ఈ పథకాన్ని మార్పులు చేయాలని, రాజకీయ ప్రమేయం లేకుండా అర్హత ఉన్న వాళ్ళందరికీ షెడ్లు నిర్మించుకునే దానికోసం అవకాశం కల్పించాలన్నారు. ఏపీ గొర్రెలు, మేకల పెంపకం దార్ల సంఘం రాష్ట్ర కమిటీ తరపున ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# ఆక్రమణల పై తహసీల్దార్ విచారణ



(షణ్ముఖ వెలుగు, వేటపాలెం, జులై 16)

మండల పరిధిలోని ఆక్రమణలపై జిల్లా కేంద్రమైన కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన పరిష్కార వేదికలో నాయుడు నాగార్జున రెడ్డి ఫిర్యాదు పై వేటపాలెం తహసీల్దార్, రెవెన్యూ అధికారులు, వేటపాలెం దేశాయి పేట పంచాయతీ కార్యదర్శుల బృందం మంగళవారం విచారణ చేపట్టారు. వేటపాలెం జంక్షన్ 216 జాతీయ రహదారి ప్రక్క కోడూరి ఆనందరాజు, ఇతరులు చట్టవిరుద్ధంగా సోనలను , డ్రైన్లను పూడ్చి జాతీయ రహదారిని ఆక్రమించి అక్రమ నిర్మాణాలను చేపట్టారని, సోనలను, డ్రైన్లను పూడ్చడానికి చట్ట విరుద్ధంగా పెద్ద వాలు ప్రాంతంలోని రైతుల భూముల్లో అక్రమంగా సుమారు 100 ట్రాక్టర్లకు పైగా మట్టిని దౌర్జన్యంగా తవ్వి తరలించి సోనలు పూడ్చివేశారంటూ ఫిర్యాదుదారుడు ఆరోపించిన వాటిపై వేటపాలెం మండల తహసీల్దార్ స్వయంగా పరిశీలించారు. అనంతరం దేశాయి పేట, వేటపాలెం పంచాయతీల పరిధిలో స్మశానాలను కొంతమంది ప్రైవేటు వ్యక్తులు కులాల పేరుతో ఆక్రమించి భారత రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా శవాలకు కులాలను అంటగట్టి కులాల వారీగా స్మశాన భూములు ఆక్రమించి ప్రహరీ, ఫెన్సింగ్ వేశారని చేసిన ఆరోపణపై స్మశాన భూములను రెవెన్యూ అధికారులు పరిశీలించారు. అనంతరం 2019 సెప్టెంబర్ 14వ తేదీన రామచంద్రాపురం గ్రామసభలో అప్పటి జిల్లా జాయింట్ శంమోహన్ సామాజిక బహిష్కరణను సమర్థిస్తూ చేసిన ప్రకటన పై నాగార్జున రెడ్డి చేసిన ఫిర్యాదు పై బాధితులను ఫిర్యాదుదారులను విచారించి బాధితుల వాదనను నమోదు చేసుకున్నారు. రామచంద్రపురం బహిష్కరణ బాధితులు కోదూరి రాజు, కోదూరు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# రోడ్డుపై పేరుకుపోయిన చెత్తను తొలగించాలి

**ఇందిరానగర్‌లో సర్పంచ్ సల్లా వీరభద్రయ్య అధ్యక్షతన జరిగిన గ్రామసభ**

**హాజరైన తెలుగుదేశంపార్టీ సీనియర్ నాయకులు**

**నూతల పార్టీ శ్రీనివాసులు నాయుడు**

(షణ్ముఖ వెలుగు, వరదయ్యపాలెం, జులై 16)

వరదయ్యపాలెం మండలం ఇందిరానగర్‌లో సర్పంచ్ సల్లా వీరభద్రయ్య అధ్యక్షతన జరిగిన గ్రామసభకు స్థానికుల నుంచి స్పందన లభించింది. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి పంచాయతీకు వచ్చిన ఆదాయం వ్యయం నివేదిక చేపట్టిన ప్రగతి పనుల గురించి విశదీకరిచారు. అనంతరం ఈ సందర్భంగా గ్రామ సభలో పంచాయతీ కార్యదర్శి హబీబ్‌కు, జిల్లా తెలుగుదేశం పార్టీ యువత అధికార ప్రతినిధి, నూతల పార్టీ హరిప్రసాద్ చౌదరి, పలు ప్రజా సమస్యలపై అర్జీ అందించారు. అర్జీలో పేర్కొన్న సమస్యలు ఇంద్రానగర్‌లో, గ్రావెల్ రోడ్లు, నాయుడు బిల్డింగ్స్‌కు పోల్స్, పద్మావతి పురంలో నూతన ట్రాన్స్ఫారం, అవంతి కాలనీకు కరెంట్ పోల్స్, వీధి దీపాలు, తహసీల్దార్ ఆఫీస్ సమీపంలో వీధి దీపాలు, రోడ్డుపై పేరుకు పోయిన చెత్తను తొలగించాలంటూ, పలు గ్రామ సమస్యలపై అర్జీ అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ యువ మోర్చా జిల్లా కార్యదర్శి దిలీప్ రాయల్, టీడీపీ నాయకులు, నూతల పార్టీకన్నయ్య చౌదరి మల్లి నాయుడు, సచివాలయం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# మందుబాబులకు నిలయంగా పెద్దపాండురు బస్సు షెల్టర్

**బస్సు సౌకర్యం లేకపోయినా,**

**బస్ షెల్లర్ కూర్చునే పరిస్థితి లేదంటున్న గ్రామస్తులు**



(షణ్ముఖ వెలుగు, వరదయ్యపాలెం, జులై 16)

ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించిన పెద్దపాండూరు బస్సు షెల్టర్ మందుబాబులకు నిలయంగా మారింది. వరదయ్యపాలెం మండలం పెదపాండూరులో ప్రయాణికుల కోసం నిర్మించిన బస్ షెల్టర్ మందుబాబులకు అసాంఘిక కార్యక్రమాలకు అడ్డగా మారిందని ప్రజలు వాపోతున్నారు. మండలంలోని తొండంబట్టు, నాగనందపురం వడ్డిపాలెం, ఎంజీ నగర్, పెద్ద పాండురు, సిద్దేశ్వరపురం, పరిసర ప్రాంతాల గ్రామ ప్రజలు ఇటు వరదయ్యపాలెం అటు సత్యవేడుకు వెళ్లాలన్న ఇక్కడకీ వచ్చి బస్సు ఎక్కాల్సింది ఉంది. ప్రస్తుతం ఈ బస్ షెల్టర్ మందు బాటలకు నిలయంగా మారడంతో కూర్చునేందుకు వీలు లేక రోడ్డుపైనే అలాగే గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తుంది. ఈ సమయంలో మందుబాబులు చేస్తున్న ఆగడాలు చూసి ప్రయాణికులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పెద్ద పాండూరు బస్సు సెంటర్ ను మందు బాబులం నుంచి రక్షించి ప్రయాణికులకు అందుబాటులో తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

# గ్రామీణ మౌలిక సదుపాయాలకు నాబార్డ్ తోడ్పాటు అందించాలి

**కలెక్టర్ తమీమ్ అన్సారియా**



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జులై 16)

జిల్లాలో గ్రామీణ మౌలిక సదుపాయాల కల్పనకు, వ్యవసాయ రంగ అభివృద్ధికి నాబార్డు తమ వంతు తోడ్పాడు అందించాలను జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, జిల్లా సహకార శాఖ, ప్రకాశం జిల్లా కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు, నాబార్డు అధికారులతో సమావేశమై ఆయా శాఖల ద్వారా అమలు చేస్తున్న కార్యక్రమాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో గ్రామీణ మౌలిక సదుపాయాల కల్పనకు, వ్యవసాయ రంగ అభివృద్ధికి నాబార్డు తమ వంతు తోడ్పాడు అందించాలన్నారు. జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు పటిష్టంగా, లాభసాటిగా నడిచేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, సహకార శాఖ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల ద్వారా చేపడుతున్న కార్యక్రమాలపై సంబంధిత అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా కలెక్టర్‌కు వివరించారు. ఈ సమావేశంలో జిల్లా సహకార శాఖాధికారి బి శ్రీనివాసరెడ్డి, నాబార్డు డిడిఎం రవి కుమార్, పిడీసీసీ బ్యాంకు సిఈఓ ఈ కోటిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# భవన నిర్మాణ కూలీలకు మహర్దశ

**చంద్రబాబు పాలనతో మా జీవితాల్లో వెలుగులు**

**ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంని కలిసిన భవన నిర్మాణ కూలీల సంఘ నాయకులు**



(షణ్ముఖ వెలుగు, వరదయ్యపాలెం, జులై 16)

చంద్రబాబు పాలనతో భవన నిర్మాణ కూలీలకు మహర్దశ ఏర్పడిందని, మా జీవితాల్లో వెలుగులు రానున్నాయని వరదయ్యపాలెం మండల భవన నిర్మాణ కూలీల సంఘం అధ్యక్షుడు కోటేశ్వర రావు కోటి అన్నారు. ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంని మంగళవారం భవన నిర్మాణ కూలీల సంఘం నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వ జగన్ పాలనలో సాగిన ఇసుక దోపిడీ కారణంగా ఇసుక లేక భవన నిర్మాణాలు స్తంభించడంతో కూలీలకు పనుల్లేక దుర్భర జీవితాన్ని గడుపుతూ కుటుంబం పోషణ లేక భారంతో పస్తులతో నరకం అనుభవించిన అష్ట కష్టాలు పడ్డామని ఆవేదన చెందారు. అనంతరం ఎమ్మెల్యే కొనేటి ఆదిమూలం మాట్లాడుతూ సమర్థుడు, అనుభవజ్ఞుడు నవ్యాంధ్ర నిర్మాత చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వము అధికారంలోకి రావడంతో ప్రజాపాలన జనరంజక పాలన ఆరంభమైందన్నారు. ప్రజల కష్టాలు తీరి అభివృద్ధికీ నాంది పలికిందని సంక్షేమ కార్యక్రమాలుతో అందరూ భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. అందరికీ అందుబాటులో ఉంటూ అన్ని విధాలా సహాయ ,సహకారాలు అందిస్తామని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కూలీల సంఘం అధ్యక్షులు శ్రీరాములు, నియోజకవర్గం కార్యదర్శి చంద్రబాబు నియోజకవర్గం అధ్యక్షులు తొండ కోటేశ్వరరావు, భవన నిర్మాణ కార్మికులు యూసఫ్ అలీ, సుబ్బు యాదవ్ పాల్గొన్నారు.

# డాక్టర్ మొర్రి పిచ్చయ్యను సన్మానించిన పద్మశ్రీ సంతోష్ యాదవ్




(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, జులై 16)

ఎవరెస్టు శిఖరాన్ని రెండుసార్లు అధిరోహించిన ప్రపంచంలోనే ఏకైక మహిళ పద్మశ్రీ సంతోష్ యాదవ్ ఇటీవల ఒంగోలు నగరంలో జై శ్రీ కృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన 10వ తరగతి విద్యార్థుల ప్రతిభ అవార్డుల కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పొదిలికొండపల్లెలో హిందీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న డాక్టర్ మొర్రి పిచ్చయ్యను సన్మానించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ పర్యావరణ రక్షణ కోసం చెట్లు నాటాలని, ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని తెలిపారు. జీవితంలో ఎవరైనా ఉన్నత శిఖరాలు అధిరోహించాలంటే పట్టుదలతో వారి లక్ష్యాన్ని చేరుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ద్రావిడ దేశం కృష్ణారావు, డాక్టర్ పెరుగు మురళీకృష్ణ, డాక్టర్ శ్రీకాంత్, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# 21న బహుజన సాహిత్య సదస్సు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 16)



బహుజన రచయితల వేదిక- ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో జూలై 21 ఆదివారం నిడదవోలులోని అంబేద్కర్ గ్రంథాలయంలో రాష్ట్రస్థాయి సాహిత్య సదస్సు నిర్వహించనున్నట్లు వేదిక రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ నూక తోటి రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. బహుజన సాహిత్యం – ఆకాంక్షలు – భారత రాజ్యాంగం అనే అంశం మీద సాహిత్య సదస్సు ఉంటుందని, ఈ సదస్సులో ప్రొఫెసర్ చల్లపల్లి స్వరూప రాణి– మిణుగురులు, మద్దూరి నగేష్ బాబు సమగ్ర కవిత్వం, డాక్టర్ నక్కా విజయరామరాజు – సుబ్బమ్మ మెస్– బహుమతి పొందిన కథలు, నేలపూరి రత్నాజీ సంపాదకత్వం వహించిన 'జాగా లేని గాజా' కవిత్వ సంకలనం, మిరప మహేష్ కవిత్వం ఆవిష్కరణలు జరుగుతాయని ఆయన తెలిపారు. మధ్యాహ్నం సెషన్లో బహుజన రచయితల వేదిక కార్యవర్గ సమావేశం ఉంటుందని అనంతరం కవి సమ్మేళనం ఉంటుందన్నారు. కవులు, సాహిత్యవేత్తలు, సాహిత్య అభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు సెల్: 9848187416 అనే నెంబర్లో సంప్రదించాలని ఆయన కోరారు.




# రైతులకు నష్టపరిహారం చెక్కులు పంపిణీ

**కొర్రప్రోలు అటవీ శాఖ అధికారిణి ప్రసన్న జ్యోతి**

(షణ్ముఖ వెలుగు, పెద్ద దోర్నాల, జులై 16)



పెద్దపులి దాడిలో మృతి చెందిన పశు యజమానులకు రెండు లక్షల ఐదువేల రూపాయలు చెక్కులు పంపిణీ చేశారు. మండల పరిధిలోని కొర్రప్రోలు అటవీ శాఖ రేంజ్ పరిధిలో పెద్దపులి దాడిలో మృతి చెందిన పశు యజమానులకు నష్టపరిహారం క్రింద కొర్రప్రోలు అటవీ శాఖ అధికారిణి ప్రసన్న జ్యోతి ఆధ్వర్యంలో రూ.20,5000 చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చెర్లోపల్లి గ్రామానికి చెందిన యజమానులకు నష్టం పరిహారం అందించారు. జంగాల హనుమంతుకు రూ.20000లు, జంగాల హనుమంతు రూ.30000లు, ఒంటేరు రాఘవ హనుమంతుకు రూ. 30000లు, ఒంటేరు రాఘవ హనుమంతు రూ.30000 లు, వెన్నం పెద్ద జడలయ్య రూ.25000లు, జంగాల రాజు రూ.20000లు, జంగా వెంకటేశ్వర్లు రూ.25000లు, జంగా పోలురాజు రూ.25000లు, చొప్పున రూ.2లక్షల 5వేలను అటవీశాఖ అధికారిని లక్ష్మీ ప్రసన్న జ్యోతి ఆధ్వర్యంలో బట్టు సుధాకర్ రెడ్డి చేతుల మీదుగా చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కొరప్రోలు అటవీ శాఖ అధికారిని ప్రసన్న జ్యోతి, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ లా నిషా, బట్టు సుధాకర్ రెడ్డి, కొప్పుల వెంకట సుబ్బారెడ్డి, అటవీ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# రోడ్డుపై వచ్చిన ఫిర్యాదు పరిశీలన





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 16)

ఒంగోలు నగరపాలక సంస్థ పరిధిలోని, ఒంగోలు పట్టణంలో ప్రతి సోమవారం మీ కోసం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నందు వచ్చిన ఫిర్యాదులను కమీషనరు జస్వంత్ కుమార్, ఒంగోలు నగరపాలక సంస్థ ఈ నెల 16వ తేదీన ఉదయం 11:30 నిమిషాలకు టౌన్ ప్లానింగ్ సిబ్బంది, టౌన్ సర్వేయరు సమక్షంలో ఘోష్ రోడ్డుపై వచ్చిన ఫిర్యాదును స్వయంగా కమీషనరు జస్వంత్ కుమార్ ఫీల్డు విజిట్ చేసి టౌన్ సర్వేయరు వారికి తగు సూచనలు ఇచ్చారు. సదరు ఫిర్యాదును పరిష్కార దిశగా చర్యలు చేపట్టారు. గద్దలగుంట పాలెంలో స్థలములో రోడ్డు వేసిన ఫిర్యాదును స్వయంగా ఫీల్డు విజిట్ చేసి టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ టౌన్ సర్వేయర్ వారికి పరిష్కార దిశగా సూచనలు ఇచ్చారు.

# ఫీల్డ్ అసిస్టెంట్ల అక్రమ తొలగింపును అడ్డుకోండి

### జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన యూనియన్ నాయకులు



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 16)**

జిల్లాలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ల అక్రమ తొలగింపును అడ్డుకోవాలని జిల్లా యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్ తమీమ్ అన్సారీకు వినతిపత్రం అందజేశారు. ఎలాంటి తప్పులు లేకున్నా కారణాలు లేకుండానే ఉద్యోగం నుండి తప్పుకోవాలని గ్రామాలలో అధికార పార్టీ నాయకులు ఒత్తిడి చేస్తున్నారని అర్జీలో పేర్కొన్నారు. జిల్లాలో ఇప్పటికే సగానికి పైగా ఫీల్డ్ అసిస్టెంట్లు రాజీనామాలు చేశారని, మిగిలిన వారు కూడా చేయాల్సిందేనని అంటున్నారని అన్నారు. రాజీనామా చేయకపోతే అధికారులతో విచారణ చేయిస్తామని లేనిపోని అభియోగాలు మోపి లక్షల్లో రికవరీలు రాపిస్తామని బెదిరిస్తున్నారని తెలిపారు. 2006 సంవత్సరం నుండి ఈ పథకంలో అరకొర జీతాలతో పని చేస్తున్నామని, ఇప్పటికే చాలామంది 45 సంవత్సరాలకు పైబడి వయసు వారు ఉన్నారని అన్నారు. ఇలాంటి సమయంలో ఉద్యోగాలు తొలగిస్తే కుటుంబాలను ఎలా పోషించుకోవాలని కలెక్టర్ ను వేడుకోవడం జరిగింది. ఇప్పుడు పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లలో చాలామందికి ఎఫ్ టి ఈ సౌకర్యం ఉందని వీరిని కూడా రాజీనామా చేయమని అటు నాయకులు, ఇటు మండల స్థాయిలో అధికారులు భయాందోళనకు గురి చేస్తున్నారని అన్నారు. గ్రామ స్థాయిలో ఫీల్డ్ అసిస్టెంట్‌లపై రాజకీయ ఒత్తిడి లేకుండా చేయాలని, తమ ఉద్యోగాలను స్వేచ్ఛగా చేసుకునేలా చూడాలని కలెక్టర్‌ను వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు కొప్పోలు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి పుల్లయ్య, కోశాధికారి ఐనంపూడి వీరబ్రహ్మయ్య, జానుబాబు, అద్దంకి వెంకట్రావు, బొజ్జ మల్లికార్జున, బిరుదుల కమలహాసన్, తదితరులు ఉన్నారు.

# ఫీల్డ్ అసిస్టెంట్ చేతివాటం

### కళత్తూరు పంచాయతీలో ఉపాధి హామీ పనుల నిధులు గోల్‌మాల్

### క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టాలని గ్రామస్తుల వినతి



**(షణ్ముఖ వెలుగు, వరదయ్యపాలెం, జులై 16)**

వరదయ్యపాలెం కళత్తూరు పంచాయతీలో సుమారు ఎనిమిదేళ్లుగా ఉపాధి హామీ పనులు చేపిస్తున్న తెప్పల బాలయ్య ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న అతను కొంతమంది బంధువర్గానికి తను అనుకున్నట్లు కళత్తూరు పంచాయతీలో ఏ సందర్భంలో పనికి వెళ్ళని గిరిజన కాలనీ వాళ్ళు. వాళ్లకి పనికి వెళ్లిన వారికి అక్రమంగా వారి ఖాతాల్లో డబ్బులు జమ చేసి వారికి కొంత డబ్బులు చెల్లించి వారి దగ్గర నుంచి వేసిన డబ్బులు తిరిగి తీసుకోవడం జరుగుతుంది. పనికి వెళ్లలేని వారు బంధు వర్గం భారీగా డబ్బులు జమ చేశారు. పనికి రాని వారి ఖాతాల్లో డబ్బులు వేయడం కోసం జెసిబీతో రాత్రిళ్లు గుంతలు కొట్టడం జరుగుతుంది. కొంతమందికి వారు ఖాతా వివరాలు తెలియజేయకుండా వారిని భయభ్రాంతులకు గురి చేస్తున్నాడు. పై అధికారులు ఈ విషయం గురించి లోతుగా దర్యాప్తు చేసి సామాజిక తనిఖీలు చేసి క్షేత్రస్థాయిలో తనిఖీలు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. గతంలో కూడా కళత్తూరు పంచాయతీ ఉమ్మడిగా ఉన్నప్పుడు ఇతను భారీగా డబ్బులు వసూలు చేసినట్టు సమాచారం. అధికారులు విచారణ చేపట్టి ఫీల్డ్ అసిస్టెంట్ పై తగిన చర్యలు తీసుకోవాలని పంచాయతీలోని బాధితులు కోరుతున్నారు. పై అధికారుల చేతివాటం చూపిస్తున్నారని, అధికారులుకు పలుమార్లు విన్నవించినా ఫలితం శూన్యమంటూ కళత్తూరు పంచాయితీ టీడీపీ నాయకులు ఎంపీడిఓకి వినతి పత్రం ఇచ్చారు.

# ఘనంగా మండవ మురళీకృష్ణ జన్మదిన వేడుకలు

### తరలివచ్చిన స్నేహితులు
### శుభాకాంక్షలు తెలిపిన శ్రేయోభిలాషులు
### నగరంలో పలుచోట్ల సేవా కార్యక్రమాలు



















**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 16)**

సూర్య శ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ చైర్మన్,ఐటీసీ కాంట్రాక్టర్ మండవ మురళీకృష్ణ జన్మదిన వేడుకలు అభిమానులు, శ్రేయోభిలాషుల ఆనందోత్సాహాల మధ్య అత్యంత ఘనంగా అట్టహాసంగా జరిగాయి. మండవ మురళీకృష్ణ జన్మదినాన్ని పురస్కరించుకుని సూర్యశ్రీ చారిటబుల్ ట్రస్ట్ ఆవరణలో కంటి వైద్య శిబిరం నిర్వహించి పరీక్షలు జరిపి ఉచితంగా కళ్ళజోళ్ళు అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ కార్యాలయంలోని దివ్యాంగులు మండల మురళీకృష్ణను ఘనంగా సత్కరించారు. అనంతరం ఒంగోలు మాతా శిశు వైద్యశాలలో చిక్కాల కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో గర్భిణీలకు, బాలింతలకు పండ్లు పంపిణీ కార్యక్రమం మండవ మురళీకృష్ణ చేతుల మీదుగా అందజేశారు. శివం శరణాలయంలో, శరణాలయం నిర్వాహకులు గొల్లపూడి శ్రీహరి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసిన అనంతరం అన్నదాన కార్యక్రమం చేశారు. అనంతరం లాస్య రెస్టారెంట్లో అభిమానులు ఏర్పాటు చేసిన భారీ కేకను కట్ చేశారు. ఒంగోలు నగరంలోని పలుచోట్ల నుంచి పెద్ద ఎత్తున అభిమానులు స్నేహితులు టిడిపి, జనసేన కార్యకర్తలు హాజరై శాలువాలతో బొకేలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండవ మురళీకృష్ణ సేవలను పలువురు కొనియాడారు. జనసేన కార్పొరేటర్ మలగా రమేష్, మండవ మురళీకృష్ణ తనయుడు సాయి శ్రీకాంత్, గుండ్లకమ్మ సాహిత్య సేవా సమితి అధ్యక్షులు రెండవ సుబ్బారావు, ఒంగోలు నగరాభివృద్ధి కమిటీ అధ్యక్షులు మారెళ్ల సుబ్బారావు, సిటిజెన్ ఫోరం అధ్యక్షులు కొల్లా మధు,చైతన్య స్వర భారతీ అధ్యక్షులు నూక తోటి శరత్ బాబు, రెడ్ క్రాస్ మహిళా విభాగం నాయకులు కోచూరి శ్రీదేవి, సుజాత, మండవ లావణ్య, సూర్య శ్రీ దివ్యంగుల చారిటబుల్ ట్రస్టు నిర్వాకులు షెహనాజ్, సర్దార్ భాష, విద్యార్థి జేఏసీ నాయకులు రాయపాటి జగదీష్, గొల్లపూడి రవి, సుబ్బు, నేరెళ్ల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగులకు వార్షిక ఇంక్రిమెంట్లు కలిపేలా చర్యలు తీసుకోవాలి



**(షణ్ముఖ వెలుగు, పొదిలి, జులై 16)**

పొదిలి డిపోలో యాజమాన్యం చేస్తున్న కార్మిక వ్యతిరేక చర్యలకు రెండో రోజు నిరాహార దీక్షలు డిపో సెక్రటరీ పి ఓబులేసు ఆధ్వర్యంలో నిరాహార దీక్షకు పీఎస్ రావు, ఎంప్లాయిస్ మహిళా కమిటీ నాయకురాలు చంద్రకళ, జి బ్రహ్మయ్య, కె వెంకట్రావు చేతుల మీదగా దండ వేసి నిరాహార దీక్షలో కూర్చోబెట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ డిపోలో మూడేళ్ల నుంచి చార్టు వేయకుండా అధికారులు కండక్టర్లను , డ్రైవర్లను ఇబ్బందులను గురిచేస్తూ అశాంతి వాతావరణాన్ని డిపోలో కలుగ చేస్తున్నారన్నారు. ఎక్సెస్ పేరుపై కనిగిరి డిపోకు రిలీజింగ్ పై పంపిన డ్రైవర్లను వెంటనే మాతృ డిపోకు తెప్పించి లీవ్ పొజిషన్ కల్పించాలన్నారు. సకాలంలో ఉద్యోగులకు వార్షిక ఇంక్రిమెంట్లు కలిపేలా చర్యలు తీసుకోవాలన్నారు. డిస్పాచ్ మెకానిక్ కృష్ణ డ్రైవర్లపై పక్షపాత వైఖరిని అవలంబిస్తున్నాడని, అతనిపై చర్యలు తీసుకుని వెంటనే డిస్ప్యాచ్ మెకానిక్‌ను వెంటనే మార్చాలని తెలిపారు. అహర్నిషలు శ్రమ పడుతూ సంస్థకు ఆర్థిక వనరులు సమకూరుస్తున్న ఉద్యోగులను నిబంధనకు విరుద్ధంగా చిన్న చిన్న తప్పులకు ఆర్థిక నష్టం కల్పిస్తున్నారు. కానీ అక్రమ మాస్టర్లు ఇచ్చి సంస్థకు ఆర్థిక నష్టం కల్పిస్తున్న ఎస్‌టిఐపై ఎటువంటి చర్యలు లేవన్నారు. ఏయంటి కార్యాలయంనందు హైయిర్ బస్‌లకు సంబంధించిన ఎస్సార్లు పోతే ఇప్పటి వరకు అధికారులు స్పందించ లేదన్నారు. పై విషయాలపై ఆర్ ఎం దృష్టికి తీసుకెళ్లిన సూపర్వైజర్లపై ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. సమస్యలు పరిష్కరించేంత వరకు ఈ రిలే నిరాహార దీక్షలు కొనసాగుతాయని తెలిపారు.

# న్యాయవాదుల పై దాడికి నిరసన విధులను బహిష్కరించిన బార్ అసోసియేషన్

**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, జులై 16)**



బెజవాడ బార్ అసోసియేషన్‌కు చెందిన న్యాయవాదులు పుప్పాల శ్రీనివాస రావు, పిల్లి సుధాకర్, వై.పూర్ణ మహేష్ లపై జరిగిన అమానుష దాడికి నిరసనగా మంగళవారం పట్టణ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు తమ విధులను బహిష్కరించి నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు భూపని కాశయ్య, యద్దనపూడి అనిల్ కుమార్ లు మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థకు మూలంగా ఉన్న నాలుగు స్తంభాల్లో ఒకటైన న్యాయ వ్యవస్థపై దాడి జరగడం అమానుషమని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దాడి న్యాయవాదులందరినీ తీవ్ర ఆందోళనకు గురిచేసిందని, ఈ సంఘటనను ప్రజాస్వామ్యవాదులందరూ ముక్త కంఠంతో ఖండించాలని వారు పిలుపునిచ్చారు. దాడులు చేయడం ద్వారా న్యాయవ్యవస్థను అదుపు చేయాలనుకోవడం మూర్ఖత్వానికి నిదర్శనమని అన్నారు. న్యాయవాదులపై దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించడంతో పాటు భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా గట్టి చర్యలు తీసుకోవాలని బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు భూపని కాశయ్య, వై అనిల్ కుమార్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఉమ్మడి రవీంద్రనాధ్, మాజీ అధ్యక్షులు కె శ్రీనివాస చౌదరి, ఎస్ కె యూసఫ్ అలీ, సీనియర్ న్యాయవాదులు సయ్యద్ అలీ జహీర్, శివరాత్రి ప్రసాద్, ఇమ్మడి శెట్టి నాగేశ్వరరావు, కడియం రామయ్య, బి రంగారెడ్డి, వల్లభనేని కాశయ్య, తోట ఉషశ్రీ, వై వెంకటేశ్వరరెడ్డి, నారాయణరెడ్డి, బత్తుల రామిరెడ్డితో పాటు జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

# నీటి సమస్యకు పరిష్కారం



**(షణ్ముఖ వెలుగు, పొదిలి, జులై 16)**

మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆదేశాల మేరకు పట్టణ అధ్యక్షులు ముల్లా ఖుద్దూస్ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ అధికారుల చొరవతో పదో వార్డు బూత్ కన్వీనర్ జంగం కొండయ్య దగ్గరుండి పైపులు రిపేరు చేయించి నీటి సమస్యకు పరిష్కారం చూపారు.

ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతవాసులు మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, టీడీపీ నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.



# పట్టణంలో సమస్యలు గుర్తించండి

### బిజెపి మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీ కృష్ణారావు



**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, జులై 16)**
మార్కాపురం పట్టణంలో కోతులు, కుక్కలు, దోమల బెడదతో పాటు ట్రాఫిక్ అంతరాయంతో ప్రజలు అనేక ఇక్కట్లు పడుతున్నారని, మున్సిపల్ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ భారతీయ జనతా పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ పివి కృష్ణారావు మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పీవీ కృష్ణారావు మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో నీ అనేక వీధులలో కోతులు శునకాలు స్వైర విహారం చేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయని, అదేవిధంగా వర్షాలు పడటంతో మురుగునీరు చేరి దోమలు వ్యాపించి ప్రజల రక్తం పిలుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వీటన్నిటిపై మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా పట్టణంలో ట్రాఫిక్ అంతరాయం ఎక్కువగా ఉందని, మున్సిపల్ స్థలాల్లో నిర్మాణాలు నిర్మించడం వలన రోడ్లు కుషించుకుపోయి ట్రాఫిక్ అంతరాయం ఎక్కువగా ఉందని అన్నారు. గోవులు రోడ్లపై సంచరిస్తుండడంతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకుని, గోవులను గోశాలకు తరలించాలని డిమాండ్ చేశారు. పట్టణంలోని సమస్యలన్నీ తీరే విధంగా కృషి చేయాలని కోరుతూ మంగళవారం మున్సిపల్ కార్యాలయంలోని మున్సిపల్ కమిషనర్‌కు వినతి ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు బొంతల కృష్ణ, మద్దెల లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.

# ఈ ఏడాది ఫోర్ వీలర్‌కు నో ఎంట్రీ

### రొట్టెల పండగకు భక్తులకు మెరుగైన వసతులు


### టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి

**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జులై 16)**
నెల్లూరు బారాషాహీద్ దర్గా రొట్టెల పండగ సందర్భంగా ఈ ఏడాది ఫోర్ వీలర్స్ అనుమతించేది లేదని టిడిపి నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పేర్కొన్నారు. భక్తుల ప్రయోజనాల దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. నెల్లూరు బారాషాహిద్ దర్గా వద్ద కార్పొరేషన్‌లోని అధికారులతో ఆయన మంగళవారము సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం నుంచి రొట్టెల పండగ ప్రారంభమవుతున్న నేపథ్యంలో వచ్చే లక్షలాది మంది భక్తుల కోసం ఎటువంటి ఇబ్బందులు లేకుండా పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసామన్నారు. మరుగుదొడ్లు, తాగునీరు, ఉచిత వైద్యం, స్వర్ణాల చెరువు వద్ద వసతులు దగ్గర నుంచి ఈ ఏడాది మెరుగైన వసతులను కల్పించామన్నారు. భక్తుల ప్రయోజనాలే తమకు ముఖ్యమన్నారు. విద్యుత్, హెల్త్, ఫైర్, పోలీస్ సిబ్బంది 24 గంటల దర్గా వద్ద నిరంతరం అందుబాటులో ఉంటారన్నారు. బారాషాహిద్ దర్గా 70 మంది కమిటీకి సంబంధించి మొత్తం 7 జోన్లుగా విభజించి వారికి బాధ్యతలు అప్పగించారు. ఈ కార్యక్రమంలో భాగంగా బారాషాహీద్ దర్గా చైర్మన్ ఖాదర్ బాషా, సాబీర్ ఖాన పాల్గొన్నారు.



# ప్రకృతి రమణీయతకు ప్రతిరూపం పాలంక క్షేత్రం

### సంతాన ప్రాప్తిని సిద్ధించే స్వామిగా ప్రతీక



**(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం ఇన్‌ఛార్జి, జులై 16)**
తొలి ఏకాదశి అంటే మనకి ముందుగా మనకు గుర్తుకు వచ్చేది పచ్చటి వృక్షాలతో దట్టమైన అడవి, పెద్ద కొండ చరియపై నుంచి జాలువారే జలపాతం, ప్రకృతి రమణీయత మైమరపించే అందాలకు ఆలవాలంగా నిలుస్తుంది. పాలంక క్షేత్రం. ఇక్కడ సహజ సిద్ధంగా ఏర్పడిన ఆదిశేషుని ఆకారం వంటి కొండచరియ కింద మూల విరాట్ పాలంకేశ్వరుడితో పాటు వీరభద్రుడు, గణపతి, పంచముఖ బ్రహ్మ, పోతురాజుల ఆలయాలు, పది అడుగుల ఎత్తున్న నాగమయ్య పుట్ట కొలువై ఉన్నాయి. సంతాన ప్రాప్తిని సిద్ధించే స్వామిగా భక్తుల పాలిట కొంగుబంగారంలా పూజలందుకుంటున్నారు. యర్రగొండపాలెం దట్టమైన నల్లమల అడవిలో, కృష్ణానది ఒడ్డున పాలంక వీరభద్రస్వామి కొలువై ఉన్నాడు. స్వామి కరుణకోసం వేలాది మంది భక్తులు కాలినడకన, ప్రత్యేకవాహనాల్లో తరలివెళ్తారు. ప్రకాశం జిల్లాతో పాటు గుంటూరు, కర్నూలు, మహబూబ్‌నగర్ జిల్లాల నుంచి భక్తులు పాలంకకు చేరుకుంటారు. సంతాన ప్రాప్తి కోసం భక్తులు నల్లమల అడవుల్లోని పాలంక వీరభద్ర స్వామి ఆలయాన్ని దర్శిస్తారు. ఇక్కడి పెద్ద కొండచరియ పైనుంచి పంచలింగాలపై జాలువారే నీటి బిందువుల కోసం సంతానం లేని దంపతులు దోసిళ్లు పడతారు. అలా దోసిళ్లపై నీటి బిందువులు పడిన దంపతులకు సంతాన భాగ్యం కలుగుతుందని భక్తుల విశ్వాసం.

# నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**(షణ్ముఖ వెలుగు, జరుగుమల్లి, జులై 16)**
ఈ నెల 17వ తేదీ ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు 33కేవీ విద్యుత్ సబ్-స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాలకు (జరుగుమల్లి, వావిలేటిపాడు, పంగులూరువారి పాలెం, చింతలపాలెం, దావగూడూరు) 33కేవీ కరెంట్ తీగల కింద ఉన్న చెట్లు తొలగిస్తున్నందున విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ అధికారులు తెలిపారు. కె బిట్రగుంట గ్రామంలో 11కేవీ కొత్త పోల్స్ ఏర్పాటు పని జరుగుతుండగా కె బిట్రగుంట గ్రామానికి ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

# ఇరిగేషన్ ఆధునీకరణ పనులు సత్వరం పూర్తిచేయాలి

### కలెక్టర్ తమీమ్ అన్సారియా





**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జులై 16)**
జిల్లాలో చేపట్టిన ఇరిగేషన్ కెనాల్స్, చెరువుల ఆధునీకరణ, మరమ్మతు పనులు సత్వరం పూర్తిచేసి సాగునీటికి, త్రాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలను జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని కలెక్టర్ చాంబర్‌లో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఇరిగేషన్ ఇంజనీరింగ్ అధికారులతో సమావేశమై మేజర్, మీడియం, మైనర్ ప్రాజెక్ట్‌లో ఉన్న నీటి లభ్యత, ఇరిగేషన్ కెనాల్స్, చెరువుల ఆధునీకరణ, మరమ్మతు పనులు, ఇరిగేషన్ ప్రాజెక్ట్స్ పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో చేపట్టిన ఇరిగేషన్ కెనాల్స్, చెరువుల ఆధునీకరణ, మరమ్మతు పనులను ప్రాధాన్యతా క్రమంలో పూర్తిచేసి సాగునీటికి, త్రాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు ప్రాజెక్ట్స్, ట్యాంక్స్, కెనాల్స్ వారిగా నీటి లభ్యత, నీటి సరఫరా, చేపట్టిన పనుల పనుల వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా కలెక్టర్ కు వివరించారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ ఎస్ఈ మురళీకృష్ణ, ప్రాజెక్ట్స్ ఎస్ఈ అబుత్ అలీం, ఇరిగేషన్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థిని మద్దుల డింపుల్‌కు ఎమ్మెల్యే కందుల అభినందన





**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, జులై 16)**
పొదిలి వీరిశెట్టి జూనియర్ కాలేజీ విద్యార్థిని మద్దుల డింపుల్‌కు ఐఐటి (జేఈఈ అడ్వాన్స్) ఢిల్లీలో కంప్యూటర్ బ్రాంచ్‌లో సీటు వచ్చిన సందర్భంగా మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, జనసేన పార్టీ ఇంచార్జి ఇమ్మడి కాశీనాథ్‌లు అభినధించారు. ఈ కార్యక్రమంలో బిట్స్ అధినేతలు బెల్లంకొండ విజయలక్ష్మి, శ్రీనివాసరావు, జనసేన నాయకులు సోమరౌతు ధర్మారావు, కల్లూరి రవికుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# పంప్ ఫిల్టర్ మరమ్మతులు

**(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, జులై 16)**
మాచర్ల మున్సిపాలిటీలో ఉన్న పంప్ హౌస్‌లో పుంపు ఫిల్టర్ చెడిపోయింది. దీంతో పట్టణంలో నివసిస్తున్న ప్రజలకు నీరు సరిగ్గా అందకపోవడం వలన వారు ఎంతో ఇబ్బంది కరంగా నివసిస్తున్నారు. మాచర్ల పట్టణ టీడీపీ అధ్యక్షుడు కొమెర దుర్గారావు, మున్సిపాలిటీలో ఉన్న పుంపు హౌస్ వద్దకు వెళ్లి, దానిని పరిశీలించి మున్సిపాలిటీ కమీషనర్, డిఈ, ఏఈతో మాట్లాడి ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా నీటిని సరఫరా చేయాలని మున్సిపాలిటీ కమిషనర్‌తో మాట్లాడారు. మున్సిపాలిటీ కమిషనర్ స్పందించి మాచర్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా నీటిని సక్రమంగా అందజేస్తామని చెప్పారు.





On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL 16448. e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com

# మండల అభివృద్ధికి కృషి చేస్తా






## ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

(షణ్ముఖ వెలుగు, అర్ధవీడు, జులై 16)

మండల అభివృద్ధికి కృషి చేస్తా గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి అన్నారు. మంగళవారం ప్రకాశం జిల్లా అర్ధవీడు మండల అభివృద్ధి కార్యాలయంలో ఎంపీపీ వెంకటరావు అధ్యక్షతన సర్వసభ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా అర్ధవీడు మండలంలోని ప్రజా సమస్యలపై సంబంధిత శాఖల అధికారులతో ఎమ్మెల్యే అశోక్ రెడ్డి చర్చించారు. అర్ధవీడు మండలం ఎంతో అభివృద్ధి చెందవలసి ఉందని సీఎం నారా చంద్రబాబు నాయుడు సహాయ, సహకారాలతో అర్ధవీడు మండలాన్ని అభివృద్ధి చేస్తామని అన్నారు. మండలంలో సమస్యల పరిష్కారానికై అధికారులు తమ వంతుగా సహాయ, సహకారాలు అందించాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి అధికారులను కోరారు. అలానే మండలంలో నీటి సమస్య తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కంభం నుండి పాపినేనిపల్లి వరకు డబుల్ రోడ్డు విస్తరణ పనులకు హామీ ఇచ్చారు. మండలంలో కుంటలు ఆక్రమణలు జరుగుతున్న విషయాన్ని సభ్యులు సభ దృష్టికి తెచ్చారు. ఈ కార్యక్రమంలో అర్ధవీడు మండల అధికారులతో పాటు స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



## రజకుల సమస్యలపై చర్చించిన ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర



(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జులై 16)

కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి రజకుల సమస్యలపై మంగళవారం ఆ సంఘం నేతలతో చర్చించారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి మార్కాపురం నివాసి కనిగిరి బాల వెంకటరమణ కు ఆంధ్రప్రదేశ్ రజక కార్పోరేషన్ చైర్మన్ పదవి ఇప్పించాల్సిందిగా కోరారు. వెంకట రమణకు ఆ పదవి వచ్చేందుకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని వారికి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కనిగిరి, మార్కాపురం రజక సంఘం నాయకులు ఎమ్మెల్యే ఉగ్రకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం, కనిగిరి నియోజకవర్గ సంఘ పెద్దలు దేవరాజుగట్టు శివకాశయ్య నాయకత్వంలో ఒంగోలు పార్లమెంటు బీసీ సెల్ కార్యదర్శి కోమటికుంట్ల వీరయ్య, ప్రకాశం జిల్లా రజక సాధికారక సమితి అధ్యక్షులు ఆరకొండ హరిప్రసాద్, కనిగిరి నియోజకవర్గ నాయకులు వేలిసెర్ల శ్రీను (పండు), మాచర్ల సుబ్బయ్య, చిలకపాటి లక్ష్మయ్య, ఆర్టీసీ కొండయ్య, ఉదయగిరి చంద్ర, రజక నాయకులు పాల్గొన్నారు.

## కూలీలు పనిచేశారు..

### గణన యంత్రంలో తొలగించారు..
### 50 ఉపాధి కూలీలు ఏమైనట్టు.?
### ఎవరు తొలగించినట్టు.?
### అధికారుల నిర్లక్ష్యం పై చర్యలు తీసుకోవాలంటున్న ఉపాధి కూలీలు

(షణ్ముఖ వెలుగు, చేజర్ల, జులై 16)

మండలంలోని బోడిపాడు గ్రామంలో ఉపాధి కూలీలకు ఘోరమైన అన్యాయం జరిగింది. ఉపాధి హామీ కూలీలు పనిచేశారు కానీ ఆ 50 మందికి సంబంధించి కూలీల మస్టర్లు తారుమారయ్యాయి. సోమవారం రోజు జరిగిన పనులకు సంబంధించి తగినవన్నీ కంప్యూటర్లో భద్రపరిచారు. అయితే మరుసటి రోజు వెళ్లి చూడగా కంప్యూటర్లో తారు మారయ్యాయని, గుర్తించి 50 మంది కూలీలు అవాక్కయ్యారు. ఈ 50 మంది కూలీల మస్టర్లు ఎవరు తొలగించారు. దీంతో ఈ వారం కూడా పని దినాలు లేకుండా చేశారు. అధికారులు ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారా అని మండిపడుతున్నారు. వారం క్రితం కూడా ఆదురుపల్లిలో ఇలాంటి పరిస్థితి ఏర్పడిందని పలువురు చర్చించుకుంటున్నారు. వెలుగులోకి వచ్చింది ఈ రెండు గ్రామ పంచాయతీలే. రానివి ఇంకెన్ని ఉన్నాయో అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పూర్తిస్థాయి విచారణ జరిపితే సంబంధిత అధికారుల నిర్లక్ష్యం. సైబర్ నేరగాళ్ల గుట్టు రట్టవుతుందని ఉపాధి హామీ కూలీలతో పాటు, మండల ప్రజలు కోరుతున్నారు.

## దుర్వినియోగమైన ప్రజల సొత్తును రికవరీ చేస్తాం


### ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జులై 16)

వైసీపీ పాలనలో దుర్వినియోగమైన ప్రజల సొత్తు ప్రతి రూపాయినీ రికవరీ చేస్తామని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి స్పష్టం చేశారు. పొదలకూరులో వీర అభయాంజనేయ స్వామి దేవస్థానాన్ని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సందర్శించారు. ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్య నాయుడుతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొదట సోమిరెడ్డి, కొమ్మికి ఆత్మీయ పొదలకూరు వాసులు ఆహ్వానం పలికారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో జరిగిన విధ్వంసం నుంచి సర్వేపల్లి నియోజకవర్గం త్వరగా కోలుకునే శక్తిని ఇవ్వాలని ఆంజనేయస్వామిని కోరుకున్నట్లు సోమిరెడ్డి



వెల్లడించారు. వైసీపీ పాలనలో పేదల ఆకలి తీర్చే అన్న క్యాంటీన్ మూతపడిందన్నారు. ప్రజల దాహం తీర్చే మెగా వాటర్ ప్లాంట్ మూలన పడిందని ఆరోపించారు. సోమశిల దక్షిణ కాలువ పనులు నిలిచిపోయాయి. కండలేరు ఎడమ కాలువ లిఫ్ట్‌కు 10 కోట్లు కరెంటు బిల్లు చెల్లించకుండా పెండింగ్ పెట్టారు. ఇరిగేషన్ పనుల పేరుతో చేసిన మరో భారీ కుంభకోణం గురించి వివరాలు బయటకు వస్తున్నాయి. ప్రతి దోపిడీని వెలుగులోకి తెస్తామని ఎమ్మెల్యే సోమిరెడ్డి స్పష్టం చేశారు.



## సమస్యలను సత్వరమే పరిష్కరించిన కమిషనర్





(షణ్ముఖ వెలుగు, పొదిలి, జులై 16)

మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆదేశాలతో పట్టణంలోని వార్డుల్లోని సమస్యలను తెలుసుకుని ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తలంపుతో 1వ వార్డులో మహిళా నాయకురాలు సోమిశెట్టి శ్రీదేవి వార్డులోని సైడు కాలువల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించి శుభ్రం చేయాలని, వీధి లైట్లు వేయాలని కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్ళారు. సమస్య దృష్టికి వచ్చిన వెంటనే హుటాహుటిన ఆయన ఆ ప్రాంతానికి చేరుకుని సిబ్బంది చే కాలువల్లో పూడికలు తీయించి, వెలగని వీధి లైట్లకు మరమ్మత్తులు చేయించి ఆ ప్రాంత వాసుల కష్టాలు తీర్చారు. దీంతో ఆ ప్రాంత వాసులు మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించేలా చర్యలు చేపట్టిన సోమిశెట్టి శ్రీదేవి, సమస్య తెలుసుకున్న వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్న కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## జనసేన జిల్లా కార్యాలయంలో సిటీ డివిజన్ నాయకులతో కోర్ కమిటీ సమావేశం





(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జులై 16)

జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ సూచనల మేరకు జనసేన పార్టీ జాతీయ మీడియా ప్రతినిధి నెల్లూరు జిల్లా పర్యవేక్షకులు వేములపాటిట అజయ్, 15 మందితో ఏర్పాటు చేసిన కోర్ కమిటీ ఆధ్వర్యంలో జనసేన పార్టీ సిటీ డివిజన్ నాయకులతో జనసేన పార్టీ జిల్లా కార్యాలయం, గోమతి నగర్ నందు సమావేశం జరిగింది. కోర్ కమిటీ సభ్యులు, డివిజన్ నాయకుల పరిచయ కార్యక్రమం, భవిష్యత్ కార్యాచరణ గురించి మాట్లాడుకున్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ కార్యాలయం ఇంచార్జ్ జమీర్, కోర్ కమిటీ సభ్యులు నూనె మల్లికార్జున యాదవ్, గునుకుల కిషోర్, కృష్ణారెడ్డి, రవి, నాగరత్నం యాదవ్, చంద్రశేఖర్‌రెడ్డి, శ్యామ్, చదలవాడ రాజేష్, శ్రీరామ్, శ్రీపతి రాము, సిటీ డివిజన్ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## కౌలు రైతులకు అవగాహన సదస్సు

(షణ్ముఖ వెలుగు, హనుమంతునిపాడు, జులై 16)

మండలంలోని ముప్పలపాడు, కూటగుండ్ల, సీతారాంపురం కౌలు రైతుల అవగాహన సదస్సులు జరిగాయి. కౌలు కార్డుల వల్ల ఉపయోగాలు వ్యవసాయ అధికారి తెలిపారు. ప్రభుత్వం అందించే రాయితీలు ఉచిత పంటల భీమా, ప్రకృతి వైపరీత్యాల వలన కలిగే పంట నష్ట పరిహారం మొదలైన పథకాలు ఏ విధంగా అయితే రైతులు పొందుతారో కౌలు రైతులు కూడా పొందవచ్చని మండల వ్యవసాయాధికారి సూచించారు. కార్డు పరిమితి 11 నెలలు మాత్రమే అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి గోపి కృష్ణ గ్రామ వ్యవసాయ అధికారులు డి శారద, గ్రామ రెవెన్యూ అధికారులు రైతులు పాల్గొన్నారు. సి సిఆర్‌సి కార్డులు రైతులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.



## హెల్మెట్ వాడకంపై అవగాహన




(షణ్ముఖ వెలుగు, వెలిగండ్ల, జులై 16)

మోటార్ సైకిల్ వాహనదారులు ప్రయాణించే సమయంలో తప్పనిసరిగా తలకు హెల్మెట్ వినియోగించాలని వెలిగండ్ల ఎస్ ఐ యం శివ అన్నారు. మంగళవారం వెలిగండ్లలో కనిగిరి మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జరిగిన మోటార్ సైకిల్ వాహనదారులు హెల్మెట్ ధరించడం పై అవగాహన కార్యక్రమంలో భాగంగా హెల్మెట్ ధరించండి ప్రాణాలు కాపాడుకోండి అంటూ అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు హెల్మెట్ లేకపోవడంతో మరణాలు ఎక్కువగా జరుగుతున్నాయని మరణాలు తగ్గించుటకొరకు న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ, పారా లీగల్ వాలంటీర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుళ్లు జి అచ్చిరెడ్డి, ఎస్ శ్రీనివాసులు, పారా లీగల్ వాలంటీర్లు, జివిస్ అండ్ జిడికె ఫౌండేషన్ చైర్మన్ గంధం శ్యామల్ గెర్షోమ్, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ మంద్రు రమేష్ బాబు, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

## రైతులకు పచ్చి రొట్ట విత్తనాలు పంపిణీ



(షణ్ముఖ వెలుగు, అర్ధవీడు, జులై 16)

రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి పంపిణీ చేశారు. మంగళవారం అర్ధవీడు మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం జరిగింది. కార్యక్రమం అనంతరం స్థానిక మండల వ్యవసాయ అధికారి షేక్ మహమ్మద్ ఎమ్మెల్యే చేతుల మీదుగా పచ్చిరొట్ట విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులతో పాటు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.